


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 343, పేజీలు - 08

బుధవారం, జూన్ 3, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడమే లక్ష్యం

**- పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు**

- ప్రభుత్వ పురోగతిని వివరించిన సీఎం రేవంత్ రెడ్డి
- అన్ని ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారని హర్షం
- 4.5 లక్షల ఇళ్లు నిర్మించాలన్నదే లక్ష్యమని వెల్లడి
- 30 నెలల్లో ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చామన్న సీఎం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రపంచానికే తెలంగాణను గేట్‌వేగా నిలబెట్టాలన్నది తన స్వప్నం అని సీఎం రేవత్ రెడ్డి తెలిపారు. స్వరాష్ట్ర అస్తిత్వం కోసం దశాబ్దాల ఉద్యమ పోరాటాలు, ఎందరో అమరుల త్యాగాల చరిత్రను స్మరిస్తూ తెలంగాణను అభివృద్ధి చేసుకుని ప్రపంచానికే గేట్‌వేగా నిలబెట్టాలన్న స్వప్నం కోసం పునరంకితమవుదామని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భద్రతా దళాల కవాతు, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలు, వారు ప్రదర్శించిన తెగువను స్మరించుకుంటున్నట్టుగా సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అన్ని రంగాల్లో ప్రగతిని సాధిస్తూ తెలంగాణ సమ్మిళిత, సమగ్రాభివృద్ధికి ప్రజాప్రభుత్వం తీసుకున్న సంకల్పం, నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనలో ప్రజల అండదండలు,



సహకారం ఉండాలని కోరారు. 2023 డిసెంబర్ 7న రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన క్షణం నుంచి ప్రతిక్షణం తెలంగాణ హితమే పరమార్థంగా, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా, పేదరికం నిర్మూలనే ప్రాధాన్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. అందుకు స్ఫూర్తిగా "పుట్టుక నీది.. చావు నీది, బతుకంతా దేశానిది" అన్న ప్రజా కవి కాళోజీ గారి మాటలను ఉటంకించారు. స్వరాష్ట్ర స్వప్నాన్ని నిజం చేసిన ఆనాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, ఆనాటి యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీలకు ధన్యవాదాలు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని సంక్షేమ

2లో..

## బీజేపీకి అన్నామలై రాజీనామా

**- అధిష్ఠానానికి ఐదు పేజీల సుదీర్ఘ లేఖ**

- 2020లో ఐపీఎస్ ఉద్యోగానికి అన్నామలై రాజీనామా
- మోదీని స్ఫూర్తిగా తీసుకుని రాజకీయాల్లోకి ఎంట్రీ
- బీజేపీ చేరిన వెంటనే తమిళనాడు ఉపాధ్యక్ష బాధ్యతలు



చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడు బీజేపీ నేత, మాజీ ఐపీఎస్ కే అన్నామలై ఆ పార్టీకి మంగళవారం రాజీనామా చేశారు. ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలను కలిసిన అనంతరం తన రాజీనామా లేఖను సమర్పించారు. బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌లకు ఐదు పేజీల లేఖను అన్నామలైన అందజేశారు. అయితే, అన్నామలై రాజీనామాను బీజేపీ అధిష్ఠానం మాత్రం ఆమోదించలేదు. గత రెండు రోజులుగా అన్నామలై రాజీనామాపై ఊహాగానాలు జోరుగా సాగుతున్న సంగతి తెలిసిందే. బీజేపీని వీడి కొత్తగా రాజకీయ వేదికను ఏర్పాటుచేసుకుంటారనే ప్రచారం జరుగుతోంది. రేపు తన పుట్టిన రోజు సందర్భంగా రాజకీయ భవిష్యత్తుపై అన్నామలై ప్రకటన చేసే అవకాశం ఉంది. మాజీ ఐపీఎస్ అయిన అన్నామలై 'లౌకిక', 'తమిళ-కేంద్రీకృత' దృక్పథంతో ఒక కొత్త ప్రాంతీయ పార్టీని ప్రారంభించాలని యోచిస్తున్నట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ప్రతిపాదిత ఈ పార్టీని ఆరు నుంచి ఎనిమిది నెలల్లోగా ప్రారంభించే అవకాశం ఉంది. తమిళనాడులోని బీజేపీ, ద్రావిడ ప్రధాన పార్టీలకు ప్రత్యామ్నాయంగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

2లో..

## తెలంగాణ ఏమైనా మీ అయ్య జాగీరా..?

**- రావొద్దనడానికి మీరెవరని పవన్ కల్యాణ్ ఫైర్**

- తెలంగాణలో ఇకపై జనసేన పోటీ చేస్తుందని పవన్ ప్రకటన
- బెదిరింపులకు, హెచ్చరికలకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టీకరణ
- చెరువు కబ్జా ఆరోపణలపై సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్
- తాను తెలంగాణకు వ్యతిరేకం కాదని, విభజన తీరునే తప్పుపట్టానని వెల్లడి
- అధికారంపై ఆశ లేదు, సమాజంలో మార్పు మాత్రమే లక్ష్యమని ఉద్ఘాటన



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జనసేన పార్టీ తలపెట్టిన సభ రద్దు కావడంతో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణలో తాను ఎలా తిరుగుతానో చూస్తామంటూ చాలా మంది ఇప్పుడు మాట్లాడుతున్నారని తెలంగాణ కోసం తాను పోరాటాలు చేసినప్పుడు ఈ నాయకులు అంతా ఎక్కడికి పోయారు అని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ ను తెలంగాణకు రానివ్వం అంటున్నారని ఇదేమైనా మీ అయ్య జాగీరా అంటూ పవన్ కళ్యాణ్ నిలదీశారు. తనను బెదిరించడానికి మీరు ఎవరు అంటూ ప్రశ్నించారు. తనను ఎంత తిట్టినా పట్టించుకోనని తనకు తెలంగాణలో కంటే ఆంధ్రప్రదేశ్‌లోనే బెదిరింపులు ఎక్కువ అని చెప్పారు. భయపడే వాళ్లమే అయితే రాజకీయ పార్టీని పెడతామా అని పేర్కొన్నారు. తెలంగాణ నడిబొడ్డున జనసేన పుట్టిందని హైదరాబాద్ నడిబొడ్డున పార్టీ ఆవిర్భవించిందని స్పష్టం చేశారు. తెలంగాణకు జనసేన పార్టీ వ్యతిరేకం అని ప్రచారం చేస్తున్నారని తెలంగాణలో లక్ష మంది జనసైనికులు ఉన్నారని గుర్తు చేశారు. తెలంగాణపై తనకు ఉన్న ప్రేమ రాజకీయాలకు అతీతమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజనకు, సంస్కృతికి జనసేన పార్టీ వ్యతిరేకం కాదని తేల్చి చెప్పిన పవన్ కళ్యాణ్ కానీ విభజించిన తీరుకు మాత్రమే

2లో..

## పుష్కర తెలంగాణ.. ముష్కరుల పాలైంది

**- రేవంత్ రెడ్డి టార్గెట్‌గా కేటీఆర్ ఖతర్నాక్ పంచ్‌లు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ఆవిర్భావ వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పార్టీలకతీతంగా తెలంగాణ ఆవిర్భావంనాటి పరిస్థితులు, ఉద్యమంలో అమరులైన వారి త్యాగాలను అన్ని పార్టీలు మరోసారి గుర్తుకు తెచ్చుకున్నాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ జెండాతో పాటు, జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతే కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ అడ్డగాడిద, రాష్ట్రానికి పట్టిన దరిద్రమంటూ ఫైర్ అయ్యారు. దేశమంతా ఈ కాంగ్రెస్ అనే దరిద్రాన్ని వదిలించుకుంటే, ఇక్కడ మాత్రం మోసపూరిత హామీలు నమ్మి ప్రజలు మోస పోయారన్నారు.

2లో..

## గోదావరి పుష్కరాల కోసం 525 ఘాట్లు

**- పరివాహక ప్రాంతాన్ని ఆస్తిగా మార్చాలన్న చంద్రబాబు**



అమరావతి (ప్రశ్న న్యూస్) అఖండ గోదావరి అభివృద్ధి ప్రాజెక్టుపై సమీక్షలో మంత్రుల కమిటీతో పాటు వివిధ శాఖల అధికారులతో ముఖ్యమంత్రి సమగ్రంగా చర్చించారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా గోదావరి పుష్కరాలను నిర్వహించేందుకు అన్ని శాఖలూ సమన్వయంతో పనిచేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. '2027 గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టును కూడా పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు సమీక్షించారు. ఇటీవల ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి చేసిన సూచనల్ని పరిగణనలోకి తీసుకుని పనులు చేపట్టాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. పుష్కరాల నిర్వహణతో పాటు రాజమహేంద్రవరం లాంటి నగరం ఓ మెగాసిటీగా అభివృద్ధి అయ్యేలా పనులు చేపట్టాలని సూచించారు. కేవలం పుష్కరాలకు మాత్రమే పనులు పరిమితం చేయకుండా ప్రస్తుతం కల్పిస్తోన్న మౌలిక వసతులు గోదావరి పరివాహక ప్రాంతానికి ఆస్తిగా మారాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.

### - 6 జిల్లాలో 525 ఘాట్లు

'పోలవరం, ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో పుష్కరాల పనులపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో 212 కిలోమీటర్ల పొడవున ప్రవహిస్తోన్న గోదావరి నది. పోలవరం జిల్లా గుండాలలో మొదటి పుష్కర ఘాట్ కోనసీమ జిల్లా అంతర్వేది, బలుసుతిప్ప, కాకినాడలోని గోవాలంక, పశ్చిమగోదావరిలోని నర్సాపురంలో చివరి ఘాట్ నిర్మాణ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మొత్తం ఆరు జిల్లాల్లో 525 ఘాట్లను

2లో..

## ఓట్ల గల్లంతుపై మీడియా దృష్టి పెట్టాలి

- రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ కు ప్రత్యర్థులే లేరని వ్యాఖ్య
- బీజేపీ రైతు వ్యతిరేక పార్టీ అని విమర్శ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై మీడియా ప్రత్యేక దృష్టి పెట్టాలని, అర్హులైన వారి ఓట్లు గల్లంతు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఈ 'ఎస్ఐఆర్ మ్యాపింగ్' అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని ఆయన కోరారు. సచివాలయంలో జరిగిన తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల అనంతరం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాలపై ఆయన కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అసలు ప్రత్యర్థులే లేరని

2లో..

## తృణమూల్‌లో ముసలం

**- బెంగాల్‌లో 'శివసేన తరహా' తిరుగుబాటు**



కోల్కతా (ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌లో వర్గ విభేధాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఇవి ఎంతలా అంటే ఆ పార్టీ చీలిక వైపు పయనిస్తోందా? అన్నంత తారాస్థాయికి చేరుకున్నాయి. తాజాగా, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత ఎంపిక వ్యవహారం టీఎంసీలో అంతర్గత విభేదాలను పూర్తిగా బయటపెట్టింది. టీఎంసీకి చెందిన ఓ వర్గం అధిష్ఠానం నిర్ణయించిన అభ్యర్థికి కాకుండా రెబెల్ నేత రితబ్రత బెనర్జీని ప్రతిపక్ష నేతగా ఎన్నుకునేందుకు సిద్ధమవుతోన్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. మమతా బెనర్జీకి తన అత్యంత సన్నిహితుడైన శోభన్‌దేవ్ చటోపాధ్యాయను ప్రతిపక్ష నేతగా ప్రకటించడంతో

2లో..

## ఈసారి మరింత బలంగా 'ఎల్ నినో'

2లో..

**- ప్రపంచ దేశాలకు డబ్ల్యుఎమ్ఓ అలర్ట్**



## పవన్ కల్యాణ్ తెలంగాణలో తిరగొద్దని మేం చెప్పడం లేదు

- తెలంగాణ బరాబర్ మా అయ్య జాగీరే
- మమ్మల్ని గెలికితే చూస్తూ ఊరుకోమన్న పొన్నం
- పవన్ ఒక పెయిడ్ ఆర్టిస్ట్ అంటూ పొన్నం తీవ్ర విమర్శలు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) 'తెలంగాణ ఏమైనా మీ అయ్య జాగీరా? ఇలాంటి బెదిరింపులకు భయపడే వ్యక్తిని నేను కాదు' అంటూ జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి పొన్నం ప్రభాకర్

2లో..

## 10 మంది మంత్రులతో డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం

**- క్యాబినెట్ కూర్పుపై అధిష్ఠానంతో మంతనాలు**



బెంగుళూరు (ప్రశ్న న్యూస్) కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ రేపు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు మరో 10 మంది మంత్రులు ప్రమాణం చేస్తారని పార్టీ వర్గాల పేర్కొన్నాయి. ఢిల్లీలో కాంగ్రెస్ హైకమాండ్‌తో ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మంగళవారం చర్చలు జరిపిన అనంతరం తొలి విడత క్యాబినెట్‌లోకి ఎవరిని తీసుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్టు చెబుతున్నారు. మరో వారం పది రోజుల వ్యవధిలోనే క్యాబినెట్ విస్తరణ కూడా ఉంటుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. బుధవారం మధ్యాహ్నం 4.05 గంటలకు బెంగళూరులోని లోక్ భవన్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుంది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ సహా పలువురు హాజరుకానున్నారు. అయితే, డీకే శివకుమార్ క్యాబినెట్ తొలి దశలో 10 నుంచి 20 మంది మంత్రులను చేర్చుకోవాలని ప్రణాళికలు ఉన్నాయి. ప్రాథమిక జాబితా దాదాపు సిద్ధంగా ఉందని, మరికొన్ని పేర్లు ఇంకా పరిశీలనలో ఉన్నాయని ఒక సీనియర్ పార్టీ నేత తెలిపారు. "10 పేర్లను ఖరారు చేయగా, తొలి విడతలో

2లో..

## జగన్ తో అమరావతి రైతుల భేటీ

**- మీకు నేనున్నానంటూ జగన్ హామీ!**



**అమరావతి (ప్రశ్న న్యూస్)**ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక అరుదైన, అనూహ్యమైన పరిణామం చోటుచేసుకుంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో అమరావతి ప్రాంతానికి చెందిన రైతులు సమావేశం అయ్యారు. అమరావతి రాజధాని విషయంలో ఇరుపక్షాల మధ్య తీవ్రమైన రాజకీయ, చట్టపరమైన పోరాటం నడవడం, తాజాగా మావిగన్ రాజధానిని

2లో..

## బీజేపీకి అన్నామలై రాజీనామా

అన్నామలై సన్నిహితుల ప్రకారం ఆయన తమిళ గుర్తింపును జాతీయ దృక్పథంతో మేళవించి, అదే సమయంలో ప్రత్యర్థి పార్టీలను సమస్యల ఆధారంగా వ్యతిరేకించే ఒక రాజకీయ వేదికను ఊహించుకుంటున్నారు. తమిళనాడులో పార్టీ రాజకీయ వ్యూహంపై అన్నామలైకి, బీజేపీ కేంద్ర నాయకత్వానికి కొన్నాళ్లు నెలకొన్న విభేదాల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. అన్నాడీఎంకే పొత్తును పునరుద్ధరించడం, అసెంబ్లీ ఎన్నికలకు ముందు అభ్యర్థుల ఎంపిక సహా అంశాలపైనా బీజేపీపై అన్నామలై అసంతృప్తిగా ఉన్నారని వర్గాలు తెలిపాయి. పొత్తులపై ఆధారపడటం కంటే రాష్ట్రంలో ఒక స్వతంత్ర సంస్థాగత పునాదిని నిర్మించుకోవడంపై బీజేపీ దృష్టి పెట్టాలని అన్నామలై వాదించినట్లు తెలుస్తోంది. కానీ, జాతీయ నాయకత్వం విస్తృతమైన డీఎంకే వ్యతిరేక వ్యూహానికి ప్రాధాన్యత ఇచ్చిందని సమాచారం. ఎన్నికల్లో దళపతి విజయ్ నాయకత్వంలోని టీవీకే పనితీరు తమిళ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసిందని, కొత్త రాజకీయ శక్తులకు ఆస్కారం కల్పించాయని ఆయన సహచరులు పేర్కొంటున్నారు. ఇక, అన్నామలై మద్దతుదారులు మదురై, కోయంబత్తూరు నగరాల్లో 'అవతార్ 2.0', 'మీరు మా నేత.. మమ్మల్ని నడిపించండి' అంటూ ఫ్లెక్సీలు, పోస్టర్లు వేయించారు.

## తెలంగాణ ఏమైనా మీ అయ్య జాగీరా.?

తాము వ్యతిరేకమని తేల్చి చెప్పారు. పార్లమెంట్ తలుపులు మూసి విభజించిన తీరు తప్పు అని చెప్పినట్లు తెలిపారు. సామాజిక తెలంగాణ రావాలని చెప్పి మరీ వచ్చానని స్పష్టం చేశారు. తాను తెలంగాణ నలుమూలలా తిరిగిన వాడిని అని ఓట్లు పడతాయని కాదని ఆ రోజుల్లోనే తండాల దాహార్తిని తీర్చామని పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ఏపీలో తనను తిరగనివ్వం అంటే తెలంగాణలో వారాహి యాత్రకు పర్మిషన్ ఇచ్చారని కోదాడ, నల్గొండ ప్రజలు కూడా అండగా నిలిచారని స్పష్టం చేశారు.తెలంగాణ యూత్‌కు మంచి అవకాశాలు రావాలని కోరుకునే వ్యక్తిని తాను అని పవన్ కళ్యాణ్ చెప్పారు. తెలంగాణలో పార్టీని బలోపేతం చేయాలని జనసేన నేతలు చాలా సార్లు అడిగారని అయితే ఆంధ్రప్రదేశ్‌లోనే అధికారం కోరుకోని వాడిని.. తెలంగాణలో అధికారం ఎందుకు కోరుతానని ప్రశ్నించారు. తనకు అధికారంపై ప్రేమ కాదని మార్పుపైనే ప్రేమ అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌పై తెలంగాణ ప్రజలకు విద్వేషం లేదని ఒకవేళ అలా ఉంటే తెలంగాణలో ఒక్క ఏపీ వ్యక్తి కూడా ఉండేవారు కాదని తెలిపారు.తెలంగాణ విభజనకు వ్యతిరేకమని వైఎస్ రాజశేఖర్ రెడ్డి చెప్పినపుడు ఈ నాయకులు అంతా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అప్పుడు మాట్లాడకుండా వైఎస్సార్‌కు ఊడిగం చేశారని మండిపడ్డారు. తాను బెదిరింపులకు భయపడేవాడిని కాదని తాను ఇప్పటిదాకా ఒక్క తెలంగాణ నేతను కూడా ఒక్క మాట కూడా అనలేదని స్పష్టం చేశారు. తనకు రెచ్చగొట్టడం ఇష్టంలేదని ఎన్నోసార్లు తగ్గి ఉన్నానని తెలిపారు.
ప్రత్యేక తెలంగాణ కోరుకున్న మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి వల్లే సినిమా ఇండస్ట్రీ చెన్నై నుంచి హైదరాబాద్?కు వచ్చిందని పేర్కొన్నారు. పాలకులు వేరు ప్రజలు వేరని పాలకులను తిట్టండని కానీ ప్రజలను కాదని తేల్చి చెప్పారు. దేశంలో చాలా ప్రాంతాల్లో తెలుగువారు ఉన్నారని అక్కడి నుంచి వారిని పంపిస్తే మన పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తాను చెరువును ఆక్రమించానని ఆరోపణలు వచ్చాయని చెప్పిన పవన్ కళ్యాణ్ ఒకవేళ తాను కబ్జా చేశానని నిరూపణ అయితే స్వాధీనం చేసుకోండి అని సీఎం రేవంత్ రెడ్డికి చెబుతున్నానని చెప్పారు. తెలంగాణలో జనసేన పార్టీ ఉంటుందని తానే తెలంగాణలో తిరుగుతానని ఇన్నాళ్లూ భరించామని ఇకపై జనసేన పోటీ చేస్తుందని ఏం చేస్తారో చేసుకోండి అంటూ పవన్ కళ్యాణ్ సవాల్ చేశారు.

## పుష్కర తెలంగాణ.. ముష్కరుల పాలైంది

ఇప్పుడు నిజం తెలుసుకుని ప్రజలు బాధపడుతున్నారన్నారు. అడ్డ దారిలో గద్దెనెక్కిన అడ్డగాడిద కాంగ్రెస్ ప్రభుత్వంకు 50 శాతం టైం అయిపోయిందని కేటీఆర్ ఫైర్ అయ్యారు. అంతే కాకుండా మరికొన్ని రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డిని చూసి కూర్చున్న కుక్క కూడా లెవదంటూ పంచ్ లు వేశారు. చిక్కడ్ పల్లి లైబ్రేరికి రాకుండా చిక్కడు దొరకడు అనేలాగా రేవంత్ తప్పించుకుని తిరుగుతున్నాడన్నారు. ధాన్యం కొనుగులో ప్రభుత్వం విఫలమైందన్నారు.
రైతు బంధు బంద్ అయ్యి రాహుల్ బంధు స్టార్ట్ అయ్యిందని సెటైర్లు వేశారు. పుష్కర తెలంగాణ ముష్కరుల చేతిలోకి వెళ్ళిందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 2028 డిసెంబర్ లో తెలంగాణ లో కేసీఆర్ మరల ముఖ్యమంత్రి అవుతారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. అంతే కాకుండా కొంత మంది కుక్కమూతి పిందెలు, అంగుష్టమాత్రులు, అల్పసంతోషులు, పైశాచీక ఆనందం పొందే వారు ఇష్టమున్న మాటలు మాట్లాడి కొంత మంది చెలరేగిపోతున్నారన్నారు. దేశపతి శ్రీనివాస్ గారు చెప్పినట్లు వేటగాడు చెప్పిన పిట్టకథలు నిజం కావొద్దు అంటే, సింహం తన కథ తాను చెప్పాలని, ఆ సింహం మీరే కావాలని కేటీఆర్ కార్యకర్తల్లో నయా జోష్ ను నింపారు. కేసీఆర్ చెప్పడం కాదు.. ఒక్కొక్క గులాబీ సైనికుడు, ఒక్కొక చెల్లి, ఒక్కొక అక్క తెలంగాణ ప్రస్థానం గురించి చెప్పాలన్నారు.

## గోదావరి పుష్కరాల కోసం 525 ఘాట్లు

పుష్కరాల కోసం సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.ప్రస్తుతం ఉన్న 288 ఘాట్లతో సహా కొత్తగా 237 ఘాట్లను నిర్మించాలని ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేశారు. ఈసారి పుష్కరాల్లో పుణ్య స్నానాల కోసం 9 నుంచి 10 కోట్లమంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్లు సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 'పుష్కర ఘాట్లు, రహదారులు, టెంట్లు, మరుగుదొడ్లు సహా ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం పనులు చేపట్టేలా ప్రతిపాదనలపై సమీక్షలో చర్చించారు.'రాజమహేంద్రవరం, నర్సాపురం సహా వివిధ పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ శాఖ పరిధిలో రూ.1,974 కోట్ల వ్యయంతో 1,660 పనుల ప్రతిపాదనలపై చర్చించారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో రూ.1,080 కోట్ల విలువైన 1140 పనులపై చర్చించారు.

**- ఒక్కరోజులో కోటి మంది భక్తుల పుణ్యస్నానం ఆచరించే అవకాశం**

ఇకపోతే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1991లో 1.2 కోట్ల మంది భక్తుల పుష్కరస్నానాలు చేసినట్లు సమీక్షలో ప్రస్తావించారు. అనంతరం 2003లో 5 కోట్ల మంది 2015లో నవ్యాంధ్ర ప్రదేశ్‌లో 4.86 కోట్ల మంది భక్తుల పుష్కర స్నానాలు ఆచరించినట్లు స్పష్టం చేశారు. గత పుష్కరాల్లో ఒక్క రోజులో అత్యధికంగా 58.26 లక్షల మంది భక్తుల పుష్కర స్నానం చేసినట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఈసారి ఒక్కరోజులో 1 కోటి మంది పుణ్య స్నానాలు ఆచరిస్తారని అంచనా వేస్తున్నట్లు సీఎం చంద్రబాబు నాయుడుకు తెలిపారు.

**- 132 పుష్కర పనులకు అనుమతులు**

పుష్కర ఘట్ల విషయానికి వస్తేప్రస్తుతం 4.5 కిలోమీటర్ల మేర పొడవైన పుష్కర ఘాట్లు కొత్తగా నిర్మించే వాటితో కలిపి ఘాట్‌ల పొడవు 9.9 కిలోమీటర్ల మేర ప్రభుత్వం నిర్మించనుంది.అత్యధికంగా తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో 150కి పైగా పుష్కర ఘాట్‌ల నిర్మాణం జరగనున్నాయి అని అధికారులు సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే రూ.211.97 కోట్లకు సంబంధించి 132 పనులకు అనుమతులు ప్రభుత్వం మంజూరు చేసింది. ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, శానిటేషన్, తాగునీరు, భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. ఈ సమీక్షకు మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పయ్యావుల కేశవ్, బీసీ జనార్ధన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, పి.నారాయణ, హోం మంత్రి అనిత, మంత్రి నిమ్మల రామానాయుడు, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, వాసంశెట్టి సుభాష్, సీఎస్ జి.సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, దేవాదాయ, వైద్యారోగ్యం, రవాణా, పర్యాటక, పురపాలక, పంచాయితీరాజ్, ఆర్థిక, జలవనరులు, పోలీసు శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఈసారి మరింత బలంగా 'ఎల్ నినో'

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపే ఎల్ నినో ఈ ఏడాది తిరిగి రానుందని, ఈసారి దాని ప్రభావం మరింత బలంగా ఉండే అవకాశం ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎమ్ఓ) హెచ్చరించింది. పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతున్నాయని, ఇది ఎల్ నినో రాకకు సంకేతమని ఐక్యరాజ్యసమితికి చెందిన ఈ ఏజెన్సీ స్పష్టం చేసింది. డబ్ల్యూఎమ్ఓ తాజా అంచనాల ప్రకారం, జూన్ నుంచి ఆగస్టు మధ్య ఎల్ నినో ఏర్పడేందుకు 80 శాతం అవకాశం ఉండగా, నవంబర్ వరకు ఇది కొనసాగేందుకు 90 శాతం ఆస్కారం ఉంది.
సాధారణంగా ప్రతి రెండు నుంచి ఏడేళ్లకోసారి వచ్చే ఈ సహజసిద్ధమైన ప్రక్రియ, ప్రపంచవ్యాప్తంగా వర్షపాత సరళిని దెబ్బతీస్తుంది. కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన కరవులకు, మరికొన్ని చోట్ల భారీ వర్షాలు, వరదలకు కారణమవుతుంది.ఈసారి రాబోయే ఎల్ నినో, ఇప్పటికే పెరిగిన భూతాపంతో జతకలవడంపై శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ మార్పుల కారణంగా ఎల్ నినో ప్రభావం మరింత తీవ్రమవుతోందని, దీనివల్ల 2027 సంవత్సరం చరిత్రలోనే అత్యంత వేడి సంవత్సరంగా రికార్డు సృష్టించే ప్రమాదం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎల్ నినో వల్ల కలిగే విపరీత వాతావరణ పరిస్థితులైన వరదలు, కరవులు, తీవ్రమైన వేడిగాలులను ఎదుర్కొనేందుకు ప్రపంచ దేశాలు సిద్ధంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

## రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడమే లక్ష్యం

పథకాలను తెలంగాణలో అమలు చేస్తున్నామని తెలిపారు. రైతులు, యువత, ఆడబిడ్డల ఆకాంక్షలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేద వర్గాల సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి సాధన కోసం గడిచిన రెండున్నరేళ్లుగా అమలు చేస్తున్న పథకాలను ప్రస్తావించారు.తెలంగాణ రైజింగ్ -2047 దార్శనికత, రాష్ట్రం మొత్తానికి ఒకే మాస్టర్ ప్లాన్ రూపొందించడం దేశంలో ఎక్కడా లేదని క్యూర్ ప్యూర్, రేర్ గా రాష్ట్రాన్ని వర్గీకరించి మూడంచెల అభివృద్ధి వ్యూహాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. "తెలంగాణ ఆవిర్భావం తర్వాత మన దశ - దిశ ఏమిటన్న స్పష్టత లేదు. నలుగురు వ్యక్తుల ఆలోచనలే రాష్ట్ర భవిష్యత్ అన్నట్టుగా నాటి పరిస్థితి ఉండింది. అందుకే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మేధావుల మధనంతో తెలంగాణకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశాం. తెలంగాణకు అత్యంత కీలక ఆధారమైన వ్యవసాయం. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, అనుబంధ రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపాలన్న సంకల్పంతో పనిచేస్తున్నాం. ప్రజా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకంతో వరి, మొక్కజొన్న, పత్తి పంటల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. తెలంగాణ రైతులు కార్యసాధకులు కావాలంటే అప్పులేని పరిస్థితి ఉండాలన్న ఒకేసారి రూ. 2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేయడమే కాకుండా గడిచిన రెండున్నరేళ్లలో వ్యవసాయానికి, రైతు సంక్షేమానికి రూ. 1 లక్షా 56 వేల 496 కోట్లు ఖర్చు చేశాం" అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. "దళారుల బారిన పడి మోసపోకూడదని, రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర చెల్లిస్తూ, ఎంత భారమైనా సరే, చివరి గింజ వరకు పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నాం. తెలంగాణ నీటి కోసం దశాబ్దాలు గోస పడింది. పదేళ్ల గత పాలనలో సైతం పరిస్థితులు మారలేదు. కృష్ణా, గోదావరి జలాల్లో మన వాటాలు తేల్చి, ప్రాజెక్టులు పూర్తి చేసే విషయంలో ప్రజాప్రభుత్వం చిత్త శుద్ధితో ఉంది. ఈ విషయంలో రాజీ లేకుండా, లౌక్యంతో, రాజకీయ విజ్ఞతతో పని చేస్తాం. తెలంగాణకు వర ప్రదాయని ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టుకు తిరిగి ప్రాణం పోసే ప్రయత్నం చేస్తున్నాం" అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో చేపట్టిన వినూత్న కార్యక్రమాలు ఫలితంగా మహిళా సంఘాలు ఇప్పుడు ఆర్థిక శక్తి కేంద్రాలుగా, ఆడబిడ్డలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే క్షేత్రాలుగా తయారవుతున్నాయని తెలిపారు. ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ. 500లకే ఎల్పీజీ సిలిండర్లు, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాల గురించి వివరించారు. లీగల్ సమస్యలు, లిటిగేషన్లకు ఆస్కారం లేకుండా కొలువుల భర్తీ చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో సంస్కరణలు చేపట్టి రికార్డు సమయంలో 67,763 పోస్టులను భర్తీ చేసి యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచామని చెప్పారు. నోటిఫికేషన్‌ల జారీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని వెల్లడించారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు నుంచి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల వరకు ప్రతి ప్రయత్నంలో విద్యా వ్యవస్థ బలోపేతం, విద్యార్థులకు నైపుణ్యం, పాఠశాలల్లో అత్యున్నత మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. విద్యావ్యవస్థలో తీసుకొచ్చిన మార్పులను వివరించారు.పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తున్నామని, కొత్త రేషన్ కార్డులను మంజూరు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. "అమరవీరులు, పోరాటయోధులే తెలంగాణ రాష్ట్రం. వారి త్యాగాలకు విలువలేని రాష్ట్రం జీవం లేని శరీరం లాంటిదని నేను భావిస్తాను. అందుకే తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన యోధులను గుర్తించి, వారికి, వారి కుటుంబాలకు తగిన న్యాయం చేయాలన్న లక్ష్యంతో ఇటీవలే శ్రీ కె.కేశవరావు, శ్రీ కోదండరాం గారి నాయకత్వంలో అధికారికంగా ఒక కమిటీని నియమించాం. కమిటీ నివేదిక ఆధారంగా తెలంగాణ పోరాట యోధులందరినీ సముచిత రీతిన సత్కరించి, వారిపట్ల మా చిత్తశుద్ధిని చాటుకుంటాం" అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పదేళ్లుగా నిలిచిపోయిన సినిమా అవార్డులను తిరిగి ప్రారంభించుకున్నామని తెలిపారు. ప్రజా గాయకుడు గద్దరన్న పేరుతో ఈ అవార్డులను ఇవ్వడం ద్వారా తెలంగాణ చరిత్రను, సంస్కృతిని సుసంపన్నం చేసే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల గణన సర్వేను తెలంగాణ ప్రభుత్వం విజయవంతంగా చేపట్టిందని చెప్పారు. ఇపుడు దేశవ్యాప్తంగా జరుగుతున్న జన గణనకు రాష్ట్రంలో చేపట్టిన సర్వే రోల్ మోడల్‌గా నిలిచిందని గర్వంగా ప్రకటిస్తున్నానని అన్నారు.ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఉద్యోగులకు కోటి రూపాయలతో ప్రత్యేక బీమా పథకాన్ని ప్రవేశపెట్టామని తెలిపారు. ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా ఉద్యోగులకు నగదు రహిత ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) అమలు చేయబోతున్నామని చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న ప్రాంతాన్ని క్యూర్ గా ప్రపంచ స్థాయి సర్వీసెస్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.
మున్సిపల్, పోలీసు విభాగాలను పునర్వవస్థీకరించామని చెప్పారు. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ఔటర్ రింగు రోడ్డు బయటకు తరలించేందుకు హిల్ట్ పాలసీ తీసుకువచ్చామని తెలిపారు. హైదరాబాద్ నగరంలో కబ్జాలకు గురైన చెరువులు, కుంటలను కాపాడటానికి, వాటిని పునరుద్ధరించే బాధ్యతను హైడ్రాకు అప్పగించామని చెప్పారు. ప్రతిష్ఠాత్మక హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టును ఎల్ అండ్ టీ నుంచి కొనుగోలు చేసి, ప్రజల ఆస్తిగా మార్చామని తెలిపారు.
ఫోర్త్ సిటీ నిర్మాణం, నగర విస్తరణ, పెరుగుతున్న ట్రాఫిక్, ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ అవసరాలు దృష్టిలో పెట్టుకొని ఫేజ్ 2 లో ఏడు కారిడార్లలో 122.9 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరించే ప్రతిపాదనలతో తయారు చేసిన డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామని చెప్పారు.
మూసీ ప్రక్షాళనకు శ్రీకారం చుడుతున్నామని 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని గ్రీన్ ఫీల్డ్ స్మార్ట్ సిటీగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. శంషాబాద్‌ను బుల్లెట్ రైలు కేంద్రంగా అభివృద్ధి చేయటం ద్వారా రీజనల్ కనెక్టివిటీ బలోపేతం అవుతుందని అన్నారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తెలంగాణ ఎదగాలన్నది ప్రజా ప్రభుత్వ సంకల్పమని ఇందుకు అందరి సహకారం కావాలని కోరారు.

## పవన్ కల్యాణ్ తెలంగాణలో తిరగొద్దని మేం చెప్పడం లేదు

కౌంటర్ ఇచ్చారు. బరాబర్ తెలంగాణ మా అయ్య జాగీరే అంటూ సమాధానం ఇచ్చారు. తెలంగాణ ప్రాంతం మా తండ్రి, తాతల జాగీరు అని చెప్పుకొచ్చారు. ప్రెస్మీట్లో తెలంగాణపై పవన్ కల్యాణ్ మరోసారి అక్కసు వెళ్లగక్కారు అంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. పవన్ కల్యాణ్ తెలంగాణకు ఎప్పుడైనా మద్దతు ఇచ్చారా? అని నిలదీశారు. అమరవీరులకు ఏనాడైనా అండగా నిలిచారా? అని పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. పవన్ కల్యాణ్‌కు ఏపీలోనే దిక్కులేదని తెలంగాణలో ఏం చేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు.

**- బీజేపీ ఎంగేజ్ చేసుకున్న నటుడు పవన్ కల్యాణ్**

తెలుగు రాష్ట్రాలు ప్రాంతాలుగా విడిపోయి ప్రజలుగా కలిసి ఉండాలని కోరుకున్నాం అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ నవ నిర్మాణంతో పవన్ కల్యాణ్ తెలంగాణలో పీకేదేముంది అంటూ ఘాటుగా ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ బీఆర్ఎస్ లేదా బీజేపీ ఎవరో ఒకరు ఎంగేజ్ చేసుకున్న ఆర్టిస్ట్ అని, ఆయనకు సరైన స్క్రిప్ట్ ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. సినిమాల్లో ఆర్టిస్టును స్క్రీన్ టెస్ట్ చేసినట్లు తెలంగాణ రాజకీయాల్లో పవన్ కల్యాణ్ టెస్టు చేస్తున్నారనేది వాస్తవం అని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పుకొచ్చారు.

**- పవన్ కల్యాణ్ ఎప్పుడైనా తెలంగాణకు మద్దతు ఇచ్చారా?**

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలంగాణకు రావడానికి వెళ్లడానికి ఎలాంటి అభ్యంతరాలు లేదు అని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పుకొచ్చారు. కానీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజే గెలికి నవ నిర్మాణం పేరుతో సభ పెడుతామంటే చూస్తూ ఊరుకునే పరిస్థితి లేదని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రజలకు ఆంధ్ర ప్రజలకు ఎప్పుడూ స్వాగతిస్తుందని అన్నారు. మనం ప్రజాస్వామ్యంలోనే ఉన్నామని పవన్ కల్యాణ్ ఎప్పుడైనా తెలంగాణకు మద్దతు ఇచ్చారా? తెలంగాణ అమరవీరులకు ఏనాడైనా అండగా నిలిచారా అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు.

## ఓట్ల గల్లంతుపై మీడియా దృష్టి పెట్టాలి

భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ తీరును తప్పుబడుతూ.. "భారతీయ జనతా పార్టీ పక్కా రైతు వ్యతిరేక పార్టీ" అని ఆయన దుయ్యబట్టారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసే ప్రభుత్వాలకు, పార్టీలకు ప్రత్యేకంగా ప్రచారం అవసరం లేదని.. తాము చేసిన పనులే మాట్లాడతాయని చెప్పారు. ఇప్పటికే జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన సత్తా ఏంటో నిరూపించుకుందని ఆయన గుర్తుచేశారు. ఇదే క్రమంలో అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం త్వరలోనే ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకుంటుందని భట్టి విక్రమార్క వెల్లడించారు.

## తృణమూల్‌లో ముసలం

తిరుగుబాటు మొదలైంది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై రితబ్రత బెనర్జీతో పాటు మరో ఎమ్మెల్యే సందిపన్ సాహాను పార్టీ నుంచి మమతా బెనర్జీ సోమవారం బహిష్కరించారు.సస్పెన్షన్‌కు గురైన టీఎంసీ నేత రిజు దత్తా మాట్లాడుతూ.. ప్రస్తుతం బెంగాల్‌లో శివసేన తరహా (శివసేన చీలిక ఉదంతం) తిరుగుబాటు నడుస్తోందని వ్యాఖ్యానించారు. దాదాపు 50 మంది ఎమ్మెల్యేలతో కూడిన రెబల్ వర్గం తామే అసలైన టీఎంసీ అని స్పీకర్ ముందు వాదించబోతున్నట్లు దత్తా తెలిపారు. మొత్తం 80 మంది టీఎంసీ ఎమ్మెల్యేలలో 2/3 వంతు మంది వర్గంగా ఏర్పడటంతో తమ అభ్యర్థే ప్రతిపక్ష నేత అవుతారని ఆయన స్పష్టం చేశారు. అంటే, ప్రతిపక్ష నేత ఎంపిక అంశం తృణమూల్‌ను నిలువునా చీల్చినట్లు స్పష్టమవుతోంది.అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో అధికారం కోల్పోయిన టీఎంసీలో అసంతృప్తి, విభేదాలు రోజురోజుకూ ముదురుతున్నాయి. అయితే, పార్టీ అధినేత్రి మమతా బెనర్జీపై కాకుండా, జనరల్ సెక్రటరీ అభిషేక్ బెనర్జీపై నాయకులు ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఆదివారం మమతా బెనర్జీ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఏకంగా 60 మంది ఎమ్మెల్యేలు హాజరుకాకపోవడంతో కలకలం రేపింది. ప్రస్తుతం కోల్‌కతాలో అసంతృప్తులను బుజ్జగించి, అసెంబ్లీలో పార్టీని కాపాడుకోవడానికి ముమ్మర చర్చలు సాగుతున్నాయి. శోభన్‌దేవ్ చటోపాధ్యాయను ప్రతిపక్ష నేతగా ప్రతిపాదిస్తూ స్పీకర్‌కు పంపిన లేఖలో కొంతమంది టీఎంసీ ఎమ్మెల్యేల సంతకాలను ఫోర్జరీ చేశారని ముఖ్యమంత్రి సువేందు అధికారి సోమవారం సంచలన ఆరోపణలు చేశారు. దీనిపై తృణమూల్ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందిపన్ సాహా ఫిర్యాదు చేసినట్టు ఆయన వెల్లడించారు.ఈ ఫిర్యాదు చేసిన కొద్దిసేపటికే ఆ ఇద్దరు ఎమ్మెల్యేలను పార్టీ నుంచి తృణమూల్ బహిష్కరించింది. స్పీకర్‌కు అందజేసిన ఎమ్మెల్యేల జాబితాతో కూడిన లేఖపై సంతకం చేసింది పార్టీ ప్రధాన కార్యదర్శేనని, ఈ ఫోర్జరీకి అభిషేక్ బెనర్జీయే బాధ్యుడని ఎమ్మెల్యే సాహా ఆరోపించారు. ప్రస్తుతం ఈ అంశంపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఆదేశాలతో సీఐడీ విచారిస్తోంది. ఇప్పటికే పలువురు టీఎంసీ నేతలకు నోటీసులు జారీ చేయగా, అభిషేక్ బెనర్జీకి కూడా సీఐడీ సమన్లు పంపింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తన నాయకులను కాపాడుకోవడానికి తృణమూల్ కాంగ్రెస్ తీవ్రంగా శ్రమిస్తోంది. పలువురు సీనియర్ నాయకులు పార్టీ పనితీరుపై బహిరంగంగానే తమ అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. టీఎంసీలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితిపై బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి దిలీప్ ఘోష్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "ఇకపై ఆ పార్టీలో కేవలం అత్త, అల్లుడు (మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ) మాత్రమే మిగులుతారు. మిగతా నేతలంతా త్వరలోనే పార్టీని వీడటం ఖాయం" అని ఎద్దేవా చేశారు.

## జగన్ తో అమరావతి రైతుల భేటీ

ప్రతిపాదించిన సమయంలో ఈ తాజా భేటీ ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తాడేపల్లిలోని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నివాసానికి వచ్చిన అమరావతి జేఏసీ, రాజధాని ప్రాంత రైతు ప్రతినిధులు ఆయనతో సుదీర్ఘంగా ముచ్చటించారు. గతంలో మూడు రాజధానుల నిర్ణయం వల్ల తమ భూములు, భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారాయని రైతులు ఈ సందర్భంగా జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లుగా తెలుస్తోంది. అయితే నాటి నిర్ణయం వెనుక ఏ ప్రాంతానికీ అన్యాయం చేయాలనే ఉద్దేశం తనకు లేదని, అన్ని ప్రాంతాల సమాంతర అభివృద్ధే తన లక్ష్యమని జగన్ రైతులకు వివరించారు. గతంలో జరిగిన రాజకీయ పరిణామాలు, చేదు అనుభవాలను పక్కన పెట్టి, రాష్ట్ర హితం కోసం కలిసి ముందడుగు వేయాల్సిన సమయం వచ్చిందని జగన్ తెలిపారు.

**- రైతులు జగన్ తో ఏమన్నారు?**

ఈ సమావేశంలో రైతులు తమకు ఎదురవుతున్న ప్రస్తుత క్షేత్రస్థాయి ఇబ్బందులను మాజీ సీఎంకు వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ.. అమరావతిలో పనులు అనుకున్నంత వేగంగా సాగడం లేదని, భూములు ఇచ్చిన రైతులకు రావాల్సిన వార్షిక కౌలు, ప్లాట్ల అభివృద్ధి వంటి అంశాల్లో ఇంకా జాప్యం జరుగుతోందని వారు చెప్పినట్లుగా తెలుస్తోంది. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో రైతులకు జరిగిన మేలును గుర్తు చేసుకున్న వారు.. వైఎస్సార్ వారసుడిగా జగన్ కూడా తమకు అండగా నిలబడాలని, ప్రతిపక్ష నేతగా అసెంబ్లీ లోపల, బయట అమరావతి రైతుల హక్కుల కోసం పోరాడాలని కోరారు. పలువురు రైతులు భూసమీకరణలో ఇంకా భూములు ఇవ్వలేదు. ఆ భూముల్ని భూసమీకరణ ద్వారా తీసుకోవడానికి నోటిఫికేషన్ ఇచ్చారు. ఆ నోటిఫికేషన్ సమస్యలపైనా జగన్ తో చర్చించారు.

**- అండగా ఉంటానని జగన్ హామీ**

రైతుల విజ్ఞప్తులపై వైఎస్ జగన్ సానుకూలంగా స్పందించినట్లుగా తెలుస్తోంది. అమరావతి కోసం భూములిచ్చిన ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగనివ్వనని ఆయన స్పష్టం చేశారు. మీరు రాష్ట్రం కోసం త్యాగం చేసి భూములు ఇచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం మీకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ప్రతిపక్ష పార్టీగా మేము నిరంతరం ఒత్తిడి తెస్తాం అని జగన్ హామీ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. అమరావతిలో భారీగా అవినీతి జరుగుతోందని ఆ అవినీతికే వ్యతిరేకమని అమరావతి కాదన్నారు.

**- రాజకీయ సమీకరణాల్లో మార్పులు?**

అమరావతి అంటేనే వైఎస్ఆర్‌సీపీకి వ్యతిరేకం అనే ముద్రను చెరిపేసేందుకు ఈ సమావేశం ఉపయోగపడుతుందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. రాజధాని రైతులతో జగన్ నేరుగా చర్చలు జరపడం ద్వారా భవిష్యత్తులో అమరావతి వేదికగా కొత్త రాజకీయ వ్యూహాలు అమలు చేయబోతున్నారనే సంకేతాలు వెళ్లాయి. కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా, అమరావతి అభివృద్ధికి తమ పార్టీ ఎప్పుడూ అడ్డుకాదనే కొత్త లైన్‌ను జనాల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం ఈ భేటీ ద్వారా జరిగిందని భావిస్తున్నారు.

## 10 మంది మంత్రులతో డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం

ప్రమాణ స్వీకారం కోసం మరో 10 మంది కోసం చర్చిస్తున్నారు. తుది జాబితా బుధవారం వెలువడవచ్చు" అని ఆయన అన్నారు. అలాగే, కేపీసీసీ అధ్యక్షుడు, అసెంబ్లీ స్పీకర్, శాసన మండలి ఛైర్మన్ వంటి కీలక సంస్థాగత, రాజ్యాంగ నియామకాలపై కూడా చర్చలు జరిగాయి.సంస్థాగత, మంత్రి పదవుల విషయానికి వస్తే సతీష్ జార్కిహోళి, హెచ్.కె. పాటిల్, బి.కె. హరిప్రసాద్‌లకు డీకే మద్దతు ఇస్తున్నారని, పార్టీ అధ్యక్ష పదవికి సిద్ధరామయ్య హరిప్రసాద్‌కు మద్దతు ఇస్తున్నారని భావిస్తున్నారు. అలాగే, అహింద్ వర్గానికి చెందిన తన అనుచరులకు మంత్రి పదవులను ఇప్పించుకోడానికి సిద్ధూ లాబీయింగ్ చేస్తున్నారని తెలుస్తోంది. డీకే శివకుమార్‌తో పాటు ప్రమాణస్వీకారం చేసి వారిలో కేజే జార్జ్, జి.పరమేశ్వర, రామలింగా రెడ్డి, కృష్ణ బైరేగౌడ, యూటీ ఖదెర్, మల్లనగౌడ బసనగౌడ పాటిల్, 7. సతీష్ జార్ఖిహోళి, మల్లికార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే, సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, లక్ష్మీ బెబ్బాల్కర్‌లు ఉన్నట్టు తెలుస్తోంది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం కొత్త మంత్రివర్గంలో అనుభవజ్ఞులైన నాయకులు, కొత్త ముఖాలు ఉంటారు. సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ సమతౌల్యత, ముఖ్యంగా సిద్ధరామయ్య వర్గంలోని విధేయులకు ప్రాధాన్యత ఇస్తారు. కాంగ్రెస్ శ్రేణులలో డిప్యూటీ సీఎం పదవులు ఒక పెద్ద వివాదాంశంగా మారింది. జి. పరమేశ్వర, జమీర్ అహ్మద్ ఖాన్, కేజే జార్జ్, ఎంబీ పాటిల్‌లకు డీసీఎం పదవులు ఇవ్వాలని సిద్ధరామయ్య పట్టుబడుతున్నట్లు సమాచారం. అయితే, డీసీఎంల ఆలోచన సమాంతర అధికార కేంద్రాలను సృష్టించి, అనవసరమైన రాజకీయ వివాదానికి దారితీస్తుందని వాదిస్తూ శివకుమార్ దీనిని వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది.

## ఎండ తీవ్రత దృష్టా పెరెడ్ సమయంలో మార్పులు

**హైదరాబాద్** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణ పై సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. వేడిగాలుల నేపథ్యంలో పరేడ్ సమయం లో మార్పు చేసారు. ఉదయం 10 గంటలకు బదులుగా 8:30 గంటలకే పరేడ్ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, పరేడ్ బృందాల ఆరోగ్యం దృష్ట్యా నిర్ణయం తీసుకున్నారు. సోమవారం ఆసిఫాబాద్ సభపైనా సీఎం ప్రత్యేక ఫోకస్ పెట్టారు. ఎండ తీవ్రత కారణంగా సూర్యాస్తమయం తర్వాతే సీఎం సభ నిర్వహించారు. రాత్రి ఆలస్యంగా రోడ్డు మార్గంలో ప్రయాణం చేసారు. రోడ్డు మార్గం లో సాధారణ వాహనాల మాదిరిగానే సీఎం కాన్వాయ్ సాగింది. ప్రజలకు అసౌకర్యం కలగకుండా సీఎం కాన్వాయ్ తగ్గించారు. సీఎం ప్రయాణాల కోసం ట్రాఫిక్ నిలిపివేయొద్దని ఇప్పటికే అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేసారు.

# అమరుల త్యాగాలే తెలంగాణ రాష్ట్ర నిర్మాణానికి పునాదులు...

**-మంథని సహకార సంఘం పర్సన్ ఇంచార్జి చైర్మన్ కొత్త శ్రీనివాస్**



మంథని ( ప్రశ్న న్యూస్) అమరవీరుల త్యాగాలే తెలంగాణా రాష్ట్ర నిర్మాణానికి పునాధులని మంథని సహకార సంఘం పర్సన్ ఇంచార్జి చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. తెలంగాణా అవతరణ దినోత్సవ సందర్భంగా మంగళవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ ఆవరణలో సంఘం పర్సన్ ఇంచార్జి చైర్మన్ కొత్త శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం పర్సన్ ఇంచార్జి చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ నేటితో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తయ్యాయని, 2014 జూన్ 2న తెలంగాణ భారతదేశపు 29వ రాష్ట్రంగా అవతరించిందని, ఎన్నో త్యాగాలు, ఉద్యమాలు, ప్రజల ఆకాంక్షల ఫలితంగా ఏర్పడిన ఈ రాష్ట్రం నేడు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. తెలంగాణ ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలు, భాష, కళలను ప్రపంచానికి చాటిచెప్పే రాష్ట్రంగా ఎదుగుతోందని, వ్యవసాయం, విద్య, పరిశ్రమలు, ఐటీ, మౌలిక వసతుల రంగాల్లో మరింత పురోగతి సాధిస్తుందని అన్నారు. తెలంగాణ ఆవిర్భావ స్ఫూర్తిని సజీవంగా ఉంచుతూ, సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం లక్ష్యాల సాధనకు ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీను బాబు ల నాయకత్వంలో ముందుకు సాగాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, టీజీఈఅర్సి సలహాదారు శశిభూషణ్ కాచే, ఆర్టిఐ మెంబర్ మంథని సురేష్, సంఘ ఉపాధ్యక్షుడు బెల్లంకొండ ప్రకాష్ రెడ్డి, డైరెక్టర్లు ఆకుల రాజబాపు, రావికంటి సతీష్ కుమార్, లెక్కల కిషన్ రెడ్డి. కొత్త శ్రీనివాస్, దాసరి లక్ష్మి, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఎక్కేటి అనంత రెడ్డి, మాజీ ఎంపిపి కొండ శంకర్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్లి రమ, మున్సిపల్ కౌన్సిలర్లు ఎల్లంకి వంశీధర్, మారుపాక నిహారిక, జంబోజు శ్రీమతి- సమ్మయ్య, లైశెట్టి రజిత, కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్, నాయకులు అజీమ్ ఖాన్, గోటికార్ కిషన్, గుడిసె గట్టయ్య, కుడుదుల కోటయ్య, రామడుగు మారుతీ, చొప్పకట్ల హనుమంతు, బెజ్జంకి డిగంబర్, గొల్లపల్లి శ్రీనివాస్, గట్టయ్య, సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, సంఘ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల స్ఫూర్తితో తెలంగాణ అభివృద్ధి సాధించాలి

**- భాజపా మండలాధ్యక్షులు : ఎడపల్లి పరశురాం**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బోయినిపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకోవాలని, రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం, సుస్థిర ప్రగతి దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి, సీనియర్ నాయకులు గుడి రవీందర్ రెడ్డి, స్తంభంపల్లి సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్, బూరుగుపల్లి సర్పంచ్ పెంచాల సౌమ్య - మహేష్, మండల ప్రధాన కార్యదర్శి మెరుపుల గంగాధర్ గౌడ్, రాజేంద్రప్రసాద్, మండల ఉపాధ్యక్షులు ఇల్లందుల బాలయ్య, అన్నిమల్ల మోహన్ బాబు, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు సుంకపాక ప్రభు, మండల కార్యదర్శి పెంచాల మహేష్, సీనియర్ నాయకులు స్వామి కుమార్, శేఖర్, ఆవుల లక్ష్మణ్, సారంపల్లి రాజు, కళ్యాణం అనిల్, సావనపెల్లి అనిల్, ఆంజనేయులు, మస్కు విజయేందర్ రెడ్డి, రామానుజం తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్వచ్ఛ గ్రామ నిర్మాణానికి ప్రజల సహకారం అవసరం

**- గ్రామ సర్పంచ్ : చింతలపల్లి కవిత - వెంకట్ రెడ్డి**

**- రామన్నపేట లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని రామన్నపేట గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చింతపల్లి కవిత - వెంకట్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్వచ్ఛ గావ్ - సురక్షిత జలవాయు -2026 కార్యక్రమంలో భాగంగా గ్రామంలో కంపోస్ట్ నిర్వహణను పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వ్యర్థాల నిర్వహణపై

అవగాహన కల్పిస్తూ చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చింతలపల్లి కవిత - వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం సాధించిన అభివృద్ధిని ప్రతి గ్రామం ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం ద్వారా గ్రామ పరిశుభ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, స్వచ్ఛమైన గ్రామంగా రామన్నపేటను తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మిట్టపల్లి శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు నవీన్, శ్రీనివాస్, హిందూజా రెడ్డి, బాల్ రెడ్డి, శిరీష, రేణుక, గ్రామ కార్యదర్శి షబానా, అంగన్‌వాడీ టీచర్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో... మంత్రి పీఏ చంద్ర శేఖర్

**మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలను పాటిస్తూ...**

**ఉదయం నుండి సాయంత్రం వరకు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లోనే...**

**ఓపికగా ప్రజల సమస్యలను వింటూ...**

**కార్యాలయముకు వచ్చే వారి సమస్యలను పరిష్కారీస్తూ...**

**మంత్రి ఆదేశాలతో... లబ్ధిదారులకు చెక్కులు అందజేత...**



మంథని ( ప్రశ్న న్యూస్) మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ... ఆయన వ్యక్తి గత సహాయకులుగా పని చేస్తున్న ఆకుల చంద్ర శేఖర్ పట్ల మంథని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయముకు వచ్చే పనుల నిమిత్తం నియోజకవర్గంతో పాటు ఇతర ప్రాంతాల నుండి వచ్చే వారు ఆయన పట్ల మంచి అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు క్యాంప్ కార్యాలయం లోనే ఉంటూ... ఆఫీసు అవసరం నిమిత్తం వచ్చే సమస్యలను ఓపికగా వింటూ... పరిష్కారం దిశగా పని చేస్తున్నారని అంటున్నారు ఆఫీస్ కు పని నిమిత్తం వచ్చే ప్రజలు. మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలతో పిఏ గా పని చేస్తూ... ప్రజల మన్ననలు పొందుతున్నాడు. ఏ సమయంలో ఫోన్ చేసిన కూడా సమస్యల వింటూ... పరిష్కారం అయ్యే వాటికి చొరవ చూపిస్తున్నాడనీ అంటున్నారు. మంత్రి శ్రీధర్ బాబు కు గత 8 సంవత్సరాలుగా శ్రీధర్ బాబుకు పిఏ గా ఎలాంటి మచ్చ లేకుండా నమ్మకముగా పని చేస్తూ వస్తున్నాడు. కార్యాలయముకు వచ్చే వారి సమస్యలను పరిష్కారీస్తూ... మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలతో... కళ్యాణ లక్ష్మి , సిఎం అరెఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందిస్తున్నాడు. దీంతో మంత్రి శ్రీధర్ బాబు కు నమ్మిన బంటులాగా పని చేస్తూన్నాడన్న ప్రజల నుండి మంచి అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

# తెలంగాణ బీజేపీలో ఏం జరుగుతోంది

**హైదరాబాద్,** తెలంగాణ బీజేపీలో అంతర్గత విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. రాష్ట్రంలో పార్టీకి మైలేజ్ పెరుగుతున్న తరుణంలో, కీలక నేతల మధ్య సాగుతున్న ఆధిపత్య పోరు గ్రూపు రాజకీయాలను రోడ్డుకు ఈడుస్తోంది. ఒకరిపై మరొకరు పైచేయి సాధించేందుకు కొందరు నేతలు చేస్తున్న ప్రయత్నాలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తుండటంతో, అటు కేడర్ తీవ్ర గందరగోళానికి, ఆందోళనకు గురవుతోంది. ఈ పరిస్థితి ఇలాగే ఉంటే పార్టీ తీవ్రంగా నష్టపోతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బీజేపీలో గత కొంతకాలంగా సాగుతున్న పాత వర్సెస్ కొత్త నేతల వివాదం ఇప్పుడు మరింత ముదిరింది. తాజాగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను లక్ష్యంగా చేసుకుని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు తీవ్ర ఆరోపణలతో కూడిన పోస్టర్లు వేయడం కలకలం రేపింది. ఈ వ్యవహారం వెనుక కేంద్రమంత్రి బండి సంజయ్ వర్గానికి చెందిన కొందరి హస్తం ఉందంటూ ఈటల అనుచరులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, ఈటల రాజేందర్ కొంతకాలంగా సాన్నిహిత్యంగా ఉంటుండటాన్ని జీర్ణించుకోలేక, వారి మధ్య గ్యాప్ పెంచేందుకే ఈ పోస్టర్ల కుట్రకు తెరలేపారనే టాక్ వినిపిస్తోంది. అయితే, దీనికి కౌంటర్‌గా బండి సంజయ్ అనుచరులు మరో వాదనను తెరపైకి తెస్తున్నారు. గతంలో బండి సంజయ్ కొడుకు భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు కావడం వెనుక, అలాగే బండి సంజయ్‌ను రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి దించేయడం వెనుక పరోక్షంగా ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్ మరికొందరు నేతల హస్తం ఉందంటూ వారు పాత విషయాలను గుర్తు చేస్తున్నారు. ఈ వివాదాల నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా ఇరు వర్గాల మధ్య పరస్పర పోస్టులు, తీవ్ర విమర్శలు వైరల్ అవుతున్నాయి. "ఈటల ఏడుపే బీజేపీకి శాపం.. రాష్ట్ర అధ్యక్ష పదవి రాలేదని, సీఎం అభ్యర్థిగా ప్రకటించలేదని, కేంద్రమంత్రి పదవి రాలేదని నిరంతరం అసంతృప్తితో ఉంటున్నారు. రెండు చోట్ల ఎమ్మెల్యేగా ఓడిపోయినా మల్కాజిగిరి ఎంపీ టికెట్ ఇచ్చి గెలిపిస్తే? మోడీ ఇమేజ్‌తో కాకుండా తన సొంత ఇమేజ్‌తోనే గెలిచాననడం రాజకీయ నైతికత కాదు. ఇందూరు బిడ్డ ఎంపీ అర్వింద్‌కు వస్తున్న ఆదరణ చూసి కడుపుమంట ఎందుకు? నేనే ప్రత్యామ్నాయం అనే భ్రమ నుంచి బయటకు రావాలి." అని ఈటలపై పోస్టర్లు పెద్దఎత్తున వెలిశాయి. అయితే, ఈ ఆధిపత్య పోరు వెనుక అసలు కారణం కేంద్ర మంత్రివర్గ విస్తరణే అనే చర్చ రాజకీయ వర్గాల్లో బలంగా నడుస్తోంది. గతంలో బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకున్న సమయంలో? తమకు కూడా అవకాశం వస్తుందని ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, డీకే అరుణ తదితరులు ఆశించారు. కానీ బండికి మాత్రమే అవకాశం దక్కడంతో వారంతా తీవ్ర నిరాశకు గురయ్యారు. త్వరలో కేంద్ర మంత్రివర్గ విస్తరణ జరగబోతోందని, తెలంగాణ నుంచి మరొకరికి అవకాశం దక్కే ఛాన్స్ ఉందనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఎవరికి వారు ఢిల్లీ స్థాయిలో ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ మంత్రి పదవి రేసులో ముందంజలో ఉండాలనే తాపత్రయమే తాజా గ్రూపు రాజకీయాలకు, పరస్పర దుష్ప్రచారాలకు కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈటల రాజేందర్‌కు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిసిన వ్యవహారాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు తీవ్రంగా ఖండించారు. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఈటల లాంటి సీనియర్ నేతను కించపరిచేలా నీచ రాజకీయాలు చేయడం సరికాదని వారు పేర్కొన్నారు. ఇది కేవలం ఒక నాయకుడిపై జరిగిన వ్యక్తిగత దాడి మాత్రమే కాదని, తెలంగాణలో బీజేపీ పుంజుకోవడాన్ని చూసి ఓర్వలేక ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న కుట్రగా వారు అభివర్ణించారు. రాష్ట్ర బీజేపీ నేతలమంతా ఐక్యంగా ఉన్నామని, ఇలాంటి కుట్రలను తిప్పికొడతామని వారు స్పష్టం చేశారు. నేతలు పైకి ఐక్యత రాగం వినిపిస్తున్నప్పటికీ, లోపల జరుగుతున్న అంతర్గత పోరును కేంద్ర అధిష్టానం ఎలా సర్దుమణిగిస్తుందో వేచి చూడాలి.

## రైతు భరోసా యాత్రలో కలవని నేతలు

తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభ తర్వాత, రాష్ట్రంలో బీజేపీ చేపట్టిన 'రైతు ఘోష ? బీజేపీ భరోసా యాత్ర' అధికార పార్టీ గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. నాలుగు రోజుల పాటు సాగిన ఈ యాత్ర.. ఊహించిన దానికంటే.. దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న అధికార పక్షాన్ని తీవ్రంగా భయపెట్టడంలో విజయవంతమైంది. ఒక ప్రతిపక్ష నేత చేసే యాత్ర ఎంతవరకు ప్రభావం చూపించిందో చెప్పడానికి ప్రభుత్వ స్పందనే కొలమానం. మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ యాత్ర సృష్టించిన ప్రభావం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మహేశ్వర్ రెడ్డి గురి పక్కాగా తగిలిందని అర్థమవుతోంది. యాత్ర సందర్భంగా మహేశ్వర్ రెడ్డి విసిరిన సవాల్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. "రాష్ట్రంలో 80 శాతం ధాన్యం కొనుగోళ్లు జరిగాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. దమ్ముంటే ఎక్కడ జరిగాయో చూపించండి, నేను నిరూపించడానికి సిద్ధం. సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఇప్పుడే రాజీనామా చేసి మళ్లీ గెలవాలి? ఆయన గెలిస్తే నేను రాజకీయాల నుంచే శాశ్వతంగా తప్పుకుంటా!" అంటూ మహేశ్వర్ రెడ్డి విసిరిన పొలిటికల్ ఛాలెంజ్ కాంగ్రెస్ శ్రేణులను ఆత్మరక్షణలో పడేసింది. ఈ యాత్రకు బీజేపీ అగ్ర నేతల నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు దక్కకపోయినప్పటికీ.., మహేశ్వర్ రెడ్డి తన వ్యక్తిగత సామర్థ్యంతో, అందరినీ కలుపుకుపోయే మనస్తత్వంతో ఈ కార్యక్రమాన్ని విజయతీరాలకు చేర్చారు.

అలాగే నిస్తేజంగా ఉన్న గ్రౌండ్ కేడర్‌ను యాక్టివ్ చేసి, రైతుల గుండెల్లోకి బీజేపీని తీసుకెళ్లడంలో మహేశ్వర్ రెడ్డి పూర్తిగా కృతకృత్యులయ్యారబెంగాల్ ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ జాతీయ నాయకత్వం తన తదుపరి పూర్తి ఫోకస్‌ను తెలంగాణపైనే పెట్టబోతోందనే అంశంపై చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే ఈ కీలకమైన కార్యక్రమ బాధ్యతను హైకమాండ్ మహేశ్వర్ రెడ్డికి అప్పగించడం వెనుక అధిష్ఠానం ఏదైనా పెద్ద వ్యూహాన్నే అమలు చేసిందా? అనే టాక్ వినిపిస్తోంది. ఈ యాత్రను ఒక 'టెస్టింగ్ గ్రౌండ్' లాగా భావించిన అధిష్ఠానం? రాష్ట్రంలో పార్టీని పరుగులు పెట్టించడానికి మహేశ్వర్ రెడ్డే సరైన వ్యక్తి అని భావించి ఈ బాధ్యతలు అప్పగించిందా? అధిష్ఠానం నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. క్షేత్రస్థాయిలో ఉన్న లీడర్లందరినీ సమన్వయం చేసుకుంటూ ఆయన ఈ యాత్రను ఘన విజయం వైపు నడిపించారని పార్టీ భావిస్తోందా? దీనిపై రాబోయే రోజుల్లో ఎలాంటి పరిణామాలు ఉండబోతున్నాయి? అంటూ రాజకీయ వర్గాల్లో చర్చించుకుంటున్నారు. ఈ యాత్ర విజయం బీజేపీ క్యాడర్‌లో మరింత ఉత్సాహాన్ని పెంచుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# వికారాబాద్ కలెక్టర్ కార్యాయలంలో రాష్ట్ర ఆవిర్భవ దినోత్సవం

**వికారాబాద్** వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ గీతాన్ని ఆలపించన తర్వాత పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు స్పీకర్. రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతూ పోతుందని , అన్ని వర్గాల ఆర్థికాభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు ప్రసాద్ కుమార్ ఈసందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రత్యేకంగా తాండూరు కు చెందిన విద్యార్థులు చేసిన కళారి యుద్ధ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య, కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ స్నేహ మెహ్రా, జిల్లా స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆవిష్కరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన డాక్టర్ మెతుకు ఆనంద్

వికారాబాద్ జిల్లా టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

వికారాబాద్ జిల్లాతెలంగాణ ఆవిష్కరణ దినోత్సవం సందర్భంగా వికారాబాద్ జిల్లా టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించి, అనంతరం తెలంగాణ రాష్ట్ర జెండాను ఎగురవేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సేవలను గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఆవిష్కరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగగా, పార్టీ శ్రేణులు తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు

# కూకట్ పల్లిలో ఘనంగా

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

కూకట్ పల్లి

కూకట్ పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, తెలంగాణ తల్లి విగ్రహాలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పూలమాలలు వేసారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాణాలను పణంగా పెట్టీ తెలంగాణ రాష్ట్రాని సాధించారు కేసీఆర్. సాధించిన తెలంగాణను అభివృదిలో సంక్షేమ పథకాలను అందించి తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారు కేసీఆర్ అని అన్నారు. కెసిఆర్ చేసిన అభివృధికి శిలాఫలకలు మార్చి ఫోటోలు మార్చి అభివృధి అంటున్నాడు రేవంత్ రెడ్డి. కే.పి.హెచ్.బి కాలనీలో కెసిఆర్ కట్టించిన ఇండోర్ స్టేడియం నేడు బూజు బంగ్లాగా మారింది. తెలంగాణ అభివృధి చెందాలన్న ప్రజలు ఆనందంగా ఉండాలన్న మళ్ళీ కేసీఆర్ రావాలి. రాబోయే ఎన్నికల్లో గెలిచేది కేసీఆర్ ప్రభుత్వమే అని అన్నారు.

# కేసిఆర్ లేనిదే తెలంగాణనే లేదు

**మల్కాజిగిరి :** మల్కాజిగిరి నియోజకవర్గం లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే మల్కాజిగిరి జోనల్ కార్యాలయంలో మల్కాజిగిరి జోనల్ కమీషనర్ సంచిత్ గంగ్వార్ జాతీయ జండాని ఆవిష్కరించారు మల్కాజిగిరి క్రోస్ రాడ్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు జాతీయ జండా ఆవిష్కరించారు, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి ఎమ్మెల్యే విచ్చేసారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రేడిసి మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సాధనలో కేసిఆర్ పాత్ర స్మరించుకోవాల్సిన అవసరం ఉంది, కేసిఆర్ లేనిదే తెలంగాణనే లేదు అని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ రాకముందు నీటి, కరెంట్ కష్టాలు ఎలా ఉండేవో ఇప్పుడు ఎలా ఉందో ప్రజలందరూ గమనించాల్సిన అవసరం ఉందని తెలిపారు , ఎవరు ఎన్ని అనుకున్నా తెలంగాణ సాధనలో కేసీఆర్ పాత్రను చేరిపేయలేరని తెలిపారు.

# తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు సన్మానం

**మేడ్చల్** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ ఆవరణలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు ప్రతీకగా నిలిచిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని స్మరించుకుంటూ ప్రజాప్రతినిధులు, అధికారులు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ప్రభుత్వ సలహాదారులు కే కేశవరావు హాజరై జిల్లా కలెక్టర్ మను చౌదరి తో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తున్నామని తెలిపారు. గత పది ఏళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని ప్రజా పాలనలో రెండున్నర కాలంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ అమరవీరుల కుటుంబాలను సన్మానించారు.

# కొత్త కోర్సులతో, అన్ని రంగాలలో రైజింగ్ శాతవాహన

**- విశ్వవిద్యాలయ అభివృద్ధే మా ధ్యేయం - ఆచార్య ఉమేశ్**

**కరీంనగర్** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాల్లో భాగంగా శాతవాహన విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో ఉపకులపతి ఆచార్య ఉమేశ్ కుమార్ జాతీయ పతాకం ఎగరవేసి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో అన్ని రకాల మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నామని ఆధునిక పద్ధతులలో డిజిటల్, ఈ- క్లాస్ రూములతో విద్యాబోధన జరుగుతోందని, ఈ కొత్త విద్యా సంవత్సరంలో ఆర్ట్స్, సైన్స్, కామర్స్ కళాశాలలో రెండేసి నూతన కోర్సులను ప్రవేశపెట్టడానికి ప్రయత్నం చేస్తున్నామని దానిలో భాగంగా ఈ విద్యా సంవత్సరం మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సుకి దరఖాస్తు చేసామని మనకున్న సౌకర్యాలకు కోర్స్ నిర్వహించడానికి అనుమతులు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తూ విశ్వవిద్యాలయాన్ని ముందుకు తీసుకు వెళ్లాలంటే అధ్యాపక అధ్యాపకేతర బృందం కలిసి సమిష్టిగా పనిచేస్తూ తెలంగాణలోని మెరుగైన విశ్వవిద్యాలయంగా నిలపడానికి ప్రయత్నం చేయాలన్నారు. ఈ రాష్ట్ర అవతరణ వేడుకలలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్, ఓ ఎస్ డి టు వి సి డా. హరికాంత్, డీన్ సీడీసీ డా.జాఫర్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ డా.రమాకాంత్, డా.పద్మావతి, డా.మనోహర్, డా.శ్రీశైలం, పరిపాలనాధికారులు డా. నజిముద్దీన్ మునవర్, డా.హుమెరా, వివిధ విభాగాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



**గజ్వేల్( ప్రశ్న న్యూస్ )** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహాం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక మంది చేసిన త్యాగాలు, పోరాటాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, మహిళా సంక్షేమం తదితర రంగాల్లో తెలంగాణ విశేష అభివృద్ధిని సాధించిందని అన్నారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలైన బతుకమ్మ, బోనాలు వంటి పండుగలు రాష్ట్ర ప్రత్యేక గుర్తింపుగా నిలిచాయని, వాటిని భావితరాలకు పరిచయం చేసి సంరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు తెలంగాణ చరిత్ర, సంస్కృతి, వారసత్వం పట్ల అవగాహన పెంపొందించుకొని సమాజ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

# రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక

**- సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు నేతి చిన్న సంతోష్ గుప్తా**




**గజ్వేల్( ప్రశ్న న్యూస్ )** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు నేతి చిన్న సంతోష్ గుప్త గజ్వేల్ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోట్లాది మంది ప్రజల ఆకాంక్షలు, త్యాగాలు, ఉద్యమ ఫలితంగా సాధ్యమైందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పన్నెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగిందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల విస్తరణ, విద్య, వైద్యం, సాగునీరు, తాగునీటి రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. రైతులు, విద్యార్థులు, మహిళలు, యువత మరియు పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అనేక పథకాలు అమలు చేయడం ద్వారా తెలంగాణ దేశానికి ఆదర్శ రాష్ట్రంగా నిలిచిందని తెలిపారు.క్రీడా రంగంలో కూడా తెలంగాణ ప్రత్యేక గుర్తింపు సాధించిందని, యువ క్రీడాకారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం వల్ల జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రతిభ వెలుగొందుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యం పెరిగిందని, కబడ్డీ వంటి క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం మరియు క్రీడా సంఘాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు.తెలంగాణ ఉద్యమంలో అమరులైన వీరులకు ఈ సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తూ, వారి త్యాగాలను ప్రతి తరం గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధి, సమాజ పురోగతిలో యువత కీలక పాత్ర పోషించాలని, విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించి తెలంగాణకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం కేవలం ఒక పండుగ మాత్రమే కాకుండా, ఆత్మగౌరవం, స్వాభిమానం, స్వయం అభివృద్ధికి ప్రతీక అని పేర్కొన్న నేతి చిన్న సంతోష్ గుప్తా, రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## నాగారంలో ఘనంగా

# రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**- సర్పంచ్ బెల్లంకొండ శ్రీదేవి సత్యనారాయణరెడ్డి.**




**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని మండలం నాగారంలో గ్రామపంచాయతీ, సర్పంచ్ బెల్లంకొండ శ్రీదేవి సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎరుకల లలితా వెంకట స్వామి పంచాయతీ కార్యదర్శి , వార్డు సభ్యులు బూడిద శ్రీకాంత్ ,అనసూరి సత్తమ్మ ఎరుకల రాజశేఖర్, తోకల శైలజ , అధికారులు ఉద్యోగులు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు అందించాలి

**- గ్రామ సర్పంచ్ : గడల ప్రసాద్ - జాగిర్యాల్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**




**భీంగల్ (ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా,భీంగల్ మండలంలోని జాగిర్యాల్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ సర్పంచ్ గడల ప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ సాధన కోసం అమరులైన ఉద్యమకారుల త్యాగాలు ఎప్పటికీ చిరస్మరణీయమని అన్నారు. ఎన్నో పోరాటాలు, త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని, ఆ ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ ప్రజలు పాల్గొని తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. తెలంగాణ గీతాలు, నినాదాలతో గ్రామంలో వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి.

## జూన్ 4, 6, 8, 10 తేదీలలో జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు, వార్డు సభలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలి

**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ పర్యావరణ వారోత్సవాల నిర్వహణతో పాటుగా గ్రామసభల నిర్వహణపై మంగళవారం హైదరాబాదు నుండి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి మెదక్ జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ,ఎస్పీ శ్రీనివాసరావు తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాల నిర్వహణతోపాటుగా రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించి ప్రజల్లో అనేక అంశాలపై అవగాహన కల్పిస్తూ ప్రత్యక్ష ప్రజా భాగస్వామ్యాన్ని పెంపొందించాలని సూచించారు.జూన్ నెల నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ా×=) పై ప్రజల్లో అవగాహన కల్పించి ప్రజాస్వామ్య భాగస్వామ్యం పెంచాలని సూచించారు. అదేవిధంగా రాష్ట్రంలో రైతాంగం స్థిరమైన వ్యవసాయం కోసం పంటల మార్పిడి దిశగా మారాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాల సన్నద్ధత, విస్తృత స్థాయి మొక్కల నాటకం, ఘన వ్యర్థాల నిర్వహణతో పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణం వంటి అంశాల్లో ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు. స్వయం సహాయక సంఘాలు, స్థానిక నాయకుల భాగస్వామ్యంతో ప్రజల్లో చైతన్యం కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.ప్రభుత్వ కార్యక్రమాల సమర్థవంతమైన అమలుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు విస్తృత స్థాయిలో చేరువ కావాలని సూచించారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల విజయవంతమైన అమలుకు పోలీస్ శాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం బలోపేతం చేయాలని డీజీపీ సి.వి. ఆనంద్ పేర్కొన్నారు. విసి అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జూన్ 4, 6, 8, 10 తేదీలలో జిల్లా వ్యాప్తంగా మండలాల వారీగా గ్రామసభలు, వార్డు సభలు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాలను కొనసాగిస్తూనే గ్రామ సభలను కూడా నిర్వహించాలన్నారు. మండలాల వారీగా అనుకూలమైన తేదీలను చూసుకొని ఆ నాలుగు తేదీలలో అన్ని గ్రామాల్లో గ్రామసభలు జరిగేలా చూడాలని డిపిఓకు ఆదేశించారు. ఈ గ్రామ సభల్లో బాల్య వివాహాల నిర్మూలన, రోడ్డు భద్రత, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు కల్పించాలన్నారు. వీటితో పాటుగా రైతాంగం పంట మార్పిడి దిశగా అడుగులు వేసేందుకు అవగాహన కల్పించాలని సూచించారు. వరి పంటకు ఆసక్తి చూపినట్లయితే సన్న రకం వరి పంటను వేసే విధంగా ప్రోత్సహించాలన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పైన ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంకుడు గుంతల ప్రాధాన్యత, మొక్కల పెంపకంపై చైతన్యం కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రానున్న వర్షాకాలం ని దృష్టిలో ఉంచుకొని విపత్తు నిర్వహణ బృందాలు అప్రమత్తం కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలను గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకు అధికారులందరూ సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్ ,గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, పంచాయతీ అధికారి యాదయ్య, అగ్రికల్చర్ అధికారి దేవ్ కుమార్,డి ఎస్ పి లు ఇతర అధికారులు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# పచ్చని కాపురంలో చిచ్చు పెడుతున్న మద్యం

**- "మద్యపానం వద్దు" ఆరోగ్యమే ముద్దు**

**- కిష్టాపూర్ గ్రామంలో మద్యం నిషేధం ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**- గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఊశయ్య**



**మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ )** కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో మంగళవారం నాడు గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఊశయ్య ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులతో కలిసి ఒక చరిత్రత్మక నిర్ణయం తీసుకోవడం జరిగింది అది ఏంటి అంటే కిష్టాపూర్ గ్రామంలో మద్యానికి బానిసై పండంటి కాపురంలో చిచ్చు పెట్టిస్తున్న మద్యాన్ని చివరికి పాలకవర్గ సభ్యులతో కలిసి మద్యపానం నిషేధం అని తీర్మానం చేసి గ్రామ ప్రజల సమక్షంలో పెట్టారు ఈ మద్య పని నిషేధానికి గ్రామ ప్రజలు యువకులు మరియు కిరాణం షాప్ యజమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామ పాలకవర్గ సభ్యులకు సహకరించారు ఒకవేళ ఎవరైనా గ్రామంలో మద్యం అమ్మినచో వారికి పదివేల రూపాయలు జరిమానా మరియు అమ్మినప్పుడు చూసిన వారికి 5000 రూపాయలు బహుమతిగా ఇస్తామని గ్రామ పాలకవర్గ సభ్యులు తెలిపారు గ్రామంలో మద్యపానం నిషేధం అనేది చాలా గొప్ప నిర్ణయం ఈ నిర్ణయాన్ని గ్రామ ప్రజలు యువకులు సహకరించాలని గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఉశయ్య తెలిపారు

### మద్యం నిషేధించడంతో మహిళల కళ్ళల్లో ఆనందం

కిష్టాపూర్ గ్రామంలో మద్యపానం నిషేధించడం పట్ల మహిళల కళ్ళల్లో ఆనందం వ్యక్తం చేశారు ఎందుకనగా యువకులు మద్యానికి బానిసై ఎంతోమంది యువకులు రోడ్డు మార్గాల ద్వారా చనిపోతున్నారు ఆ కుటుంబంలో తల్లిదండ్రుల దుఃఖం చెప్పలేనిది మళ్లీ అలాంటి పునరావృతం కాకుండా మంచి నిర్ణయం తీసుకున్నందుకు గ్రామ పాలకవర్గ సభ్యులు తీసుకున్న నిర్ణయాన్ని చాలా గొప్ప నిర్ణయం అని వారు తెలిపారు మద్యపానం నిషేధించడం పట్ల పాలకవర్గ సభ్యులకు ఎల్లవేళలా తోడు ఉంటామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఉశయ్య, మాజీ సర్పంచ్ తిరునగరి గోదావరి వెంకటరాములు, గ్రామ పంచాయతీ సెక్రెటరీ మమత, ఉప సర్పంచ్ చందపురం నిర్మల శేఖర్ యాదవ్, వార్డు సభ్యులు అక్కే ప్రవీణ్ యాదవ్, నాకీర్త పెంటమ్మ, తోశ నవీన్, ఎంబరి మల్లేశం, చాకలి యశోద , పెద్దల కిషన్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు పెద్ది శ్రీశైలం బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు నాగుల గారి సుధాకర్ గౌడ్ నాయకులు అక్కే రవి, కలవగడ్డ నర్సింలు, గంధం కుమార్, కొళా సత్యం, వరిగుంతం నాగరాజు, రాజేష్ గౌడ్, కాజిపల్లి భాను, అక్కే నరేష్, పసుల అనిల్, తోశ చిన్న, ఎంబరి శీను, మాల సత్యనారాయణ, చాకలి లింగం, గ్రామ ప్రజలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సుల్లో రద్దీ తగ్గేదెలా

**హైదరాబాద్,** హైదరాబాద్ నగరంలో ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ తలకు మించిన భారంగా మారుతోంది. విద్యాసంస్థలు ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య ప్రారంభమై, సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య ముగుస్తుండటం, అదే సమయంలో కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగుల రాకపోకలు కూడా తోడవడంతో బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. ఈ రద్దీ సమస్యకు విద్యాసంస్థలు, ఆఫీసుల వేళలను మార్చడమే ఏకైక పరిష్కారంగా కనిపిస్తోంది. అయితే, కాలేజీల సమయాలను మార్చాలని గతంలో గ్రేటర్ ఆర్టీసీ 100 ఇంజినీరింగ్ కళాశాలలకు లేఖలు రాసినప్పటికీ యాజమాన్యాల నుంచి ఆశించిన స్పందన రాలేదు. రాబోయే విద్యా సంవత్సరం నాటికైనా ఈ సమన్వయం కుదిరితే ప్రయాణికుల తిప్పలు తప్పుతాయి.నగర శివార్లయిన మొయినాబాద్, ఘట్‌కేసర్, ఇబ్రహీంపట్నం, మేడ్చల్, శంకర్ పల్లి, చేవెళ్ల, పటాన్‌చెరు వంటి రూట్లలో విద్యాసంస్థలు ఎక్కువగా ఉన్నాయి. ఈ ప్రాంతాల నుంచి సికింద్రాబాద్, మెహదీపట్నం, సీబీఎస్, ఉప్పల్, ఎల్బీనగర్, హయాత్‌నగర్ వైపు నడిచే బస్సుల్లో ఉదయం 7 గంటలకే మొదటి స్టేజీ నుంచే ప్రయాణికులు కిక్కిరిసిపోతున్నారు. వరుసగా బస్సులు పంపినా రద్దీ తగ్గకపోవడంతో, వెనుక వచ్చే ప్రయాణికుల కోసం బస్సులను సర్దుబాటు చేయడం ఆర్టీసీకి పెద్ద సవాల్‌గా మారింది.సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఎక్కుతుండటంతో బస్సులు తరచూ మొరాయిస్తున్నాయి. ఫుట్‌బోర్డు ప్రయాణాల వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం పెరగడమే కాకుండా ప్రయాణాల్లో తీవ్ర ఆలస్యం చోటుచేసుకుంటోంది. పీక్ అవర్స్‌లో బస్సుల సర్దుబాటు లేకపోవడంతో బస్టాపుల వద్ద గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. సబర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉండగా.. ప్రధానంగా మహాలక్ష్మి పథకం ప్రయాణికులు (మహిళలు) తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ తీవ్ర రద్దీని అదుపు చేయడానికి నిపుణులు కొన్ని ప్రతిపాదనలను సూచిస్తున్నారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా స్కూల్, కాలేజీ సమయాల్లో అంటే ఉదయం 7.30 నుంచి 10 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 4 నుంచి 6.30 గంటల వరకు ప్రత్యేక బస్సులను నడపాలి. పాఠశాలలు, కళాశాలలు అన్నీ ఒకే సమయానికి కాకుండా 7.30 గంటలకు కొన్ని, 8.15 గంటలకు కొన్ని, 9 గంటలకు మరికొన్ని చొప్పున వేర్వేరు సమయాల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటే రద్దీ చాలా వరకు తగ్గే అవకాశం ఉంది.

# టెస్ట్.. గిస్ట్... జాన్తా నై...

## పైసలు ఉంటే లైసెన్స్

**హైదరాబాద్,** రవాణా శాఖ సేవలను డిజిటలైజ్ చేస్తూ, పౌరులకు దళారుల వేధింపులు లేకుండా సులభంగా సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 'వాహన్ పోర్టల్'ను అమల్లోకి తెచ్చింది. అయితే, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమాత్రం మారలేదు. ఆన్‌లైన్ విధానం అందుబాటులో ఉన్నప్పటికీ, ఆర్టీఓ కార్యాలయాల్లో దళారుల హవా యథేచ్ఛగా సాగుతోంది. ఇటీవల అవినీతి నిరోధక శాఖ అధికారులు నగర శివార్లలోని మేడ్చల్, పేట్‌బషీరాబాద్, కొండాపూర్ రవాణా కార్యాలయాల్లో ఏకకాలంలో జరిపిన ఆకస్మిక సోదాల్లో ఈ దందా బహిర్గతమైంది. ఈ తనిఖీల్లో భాగంగా ఆర్టీఓ కార్యాలయాల ఆవరణలో తిష్టవేసిన పలువురు మధ్యవర్తులను, ప్రైవేటు వ్యక్తులను అధికారులు అదుపులోకి తీసుకుని విచారించారు.సౌకర్యవంతమైన ఆన్‌లైన్ వ్యవస్థ ఉన్నప్పటికీ, సాధారణ వాహనదారులకు మాత్రం ఏజెంట్ల వేధింపులు తప్పడం లేదు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని, అన్ని సరైన పత్రాలతో నేరుగా వెళ్లే పౌరులకు ఏదో ఒక సాకుతో తిరస్కరిస్తూ వెనక్కి పంపుతున్నారు. అదే సమయంలో, ఒక ఏజెంట్‌ను ఆశ్రయిస్తే ఎలాంటి నిబంధనలు లేదా పరీక్షలు లేకుండానే పనులు సులువుగా పూర్తవుతున్నాయి. లెర్నింగ్ లైసెన్స్, పర్మనెంట్ లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ల వంటి ప్రతి పనికీ దళారులు సొంతంగా ఒక ధరను నిర్ణయించి సామాన్యుల నుండి భారీగా వసూలు చేస్తున్నారు. ఏజెంట్లను సంప్రదించకుండా, వారు అడిగినంత ఇచ్చుకోకుండా చిన్న పని కూడా కావడం లేదనేది బహిరంగ రహస్యంగా మారింది.ఈ అక్రమ దందాలో మోటారు డ్రైవింగ్ స్కూళ్ల పాత్ర కూడా స్పష్టంగా కనిపిస్తోంది. నిబంధనల ప్రకారం దరఖాస్తుదారులకు సరైన డ్రైవింగ్ శిక్షణ ఇవ్వాల్సి ఉండగా, కొన్ని స్కూళు కేవలం డబ్బులు వసూలు చేయడమే పనిగా పెట్టుకున్నాయి. ఆర్టీఓ కార్యాలయాల్లోని కొంతమంది సిబ్బంది చేతులు తడిపి, అర్హత లేని వారికి సైతం లైసెన్సులు ఇప్పిస్తున్నారు. చివరికి బయోమెట్రిక్, టెస్ట్ డ్రైవ్ సమయాల్లోనూ దళారుల జోక్యం మితిమీరిపోతోంది. నేరుగా వచ్చే సామాన్య పౌరులను గంటల తరబడి వేచి చూసేలా చేస్తూ, అదే దళారుల ద్వారా వచ్చే ఫైళ్లను మాత్రం నిమిషాల వ్యవధిలోనే క్లియర్ చేస్తున్నట్లు ఏసీబీ తనిఖీల్లో తేలింది.

# బోయినపల్లిలో బీజేపీ తెలంగాణ ఉత్సవాలు

**సికింద్రాబాద్** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓల్డ్ బోయిన్ పల్లి లో భాజపా నాయకుడు తిరుపతి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో భాజపా పాత్ర కీలకమని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన అనంతరం తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించినప్పటికీ ఆశయాలు ఇప్పటివరకు నెరవేరలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు వస్తే మరింత అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని అన్నారు.

# గుణదల పడవలరేవు సెంటర్‌లో ఉద్రిక్తత

**విజయవాడ** గుణదల,మాచవరం కొండ ప్రాంతాలకు సరఫరా అయ్యే నీటిని పక్క నియోజకవర్గానికి తరలింపును నిరసిస్తూ దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. ఈ నేపథ్యంలో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. నీటి తరలింపు కోసం పైప్ లైన్ ను పనులు తక్షణమే నిలుపుదల చేయాలని అవినాష్ డిమాండ్ చేసారు. పైప్ లైన్ కోసం తవ్విన గోతిలో దిగి నిరసన తెలిపారు. పోలీసుల మోహరింపుతో గుణదల పడవలరేవు సెంటర్ లో ఉద్రిక్తత నెలకొంది.

## ఘనంగా తెలంగాణ రాష్ట్ర

# అవతరణ దినోత్సవ వేడుకలు

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జిల్లా పోలీస్ భవన్ సమీపంలోని పరేడ్ గ్రౌండ్ లో మంగళవారం నిర్వహించగా, ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ముందుగా సిరిసిల్లలోని పాత బస్ స్టాండ్ సమీపంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తదితరులతో కలిసి నివాళులర్పించారు.

అనంతరం పరేడ్ గ్రౌండ్లో జాతీయ జెండాను ప్రభుత్వ విప్ ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా సందేశాన్ని వినిపించారుఅనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. అటవీ శాఖ, డీఆర్డీఓ, పోలీస్ శాఖ, పౌర సంబంధాల శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్, ఎస్పీ పరిశీలించి.. వివరాలు అడిగి తెలుసుకున్నారు. × ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పర్యావరణ ఉత్సవాల కింద అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ ఆర్డీవో కే ఎస్ బీ కుమారి, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, డీఎస్పి నాగేంద్రాచారి, సిరిసిల్ల తహసిల్దార్ మహేష్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దుగ్గిరాల

# గోపాలకృష్ణయ్య జయంతి వేడుకలు..

**గోకవరం** గోకవరం తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయం వద్ద విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, చీరాల పేరలా ఉద్యమం ద్వారా ఆంగ్లేయులను గడగడలాడించిన ఆంధ్రరత్న శ్రీ దుగ్గిరాల గోపాల కృష్ణయ్య జయంతి వేడుకలను రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెద్దాడ వెంకన్న దొర, నాగ రమేష్, బత్తిన వీరాంజనేయులు, ఆనం చెల్లారావు, మండే గౌతమ్, మండల సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ ఆదం మణికంఠ, కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేడే నీలోజిపల్లిలో బోనాల సందడి ....ఏర్పాట్లు పూర్తి

- గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి
- నీలోజిపల్లి సర్పంచ్ : అనుముల భాస్కర్
- ఆలయాల పునర్నిర్మాణంతో గ్రామస్తుల ప్రశంసలు అందుకుంటున్న సర్పంచ్ భాస్కర్



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని నీలోజిపల్లి గ్రామ ఆరాధ్య దేవతలైన శ్రీ పోచమ్మతల్లి, శ్రీ మహాలక్ష్మీ దేవి, శ్రీ దుర్గమ్మ తల్లి బోనాల మహోత్సవాలను నేడు బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొని అమ్మవార్ల ఆశీస్సులు పొందాలని కోరారు. ముఖ్యంగా మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో హాజరై అమ్మవార్లకు సామూహికంగా బోనాలు సమర్పించి ఉత్సవాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో సుఖశాంతులు, పంటల సమృద్ధి, ప్రజల ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం గ్రామంలోని దేవాలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ఆలయాల పునర్నిర్మాణ పనులను పూర్తి చేయడంతో పాటు ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. గ్రామ దేవతల ఆలయాలు నూతన శోభను సంతరించుకోవడంతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం పట్ల పలువురు గ్రామస్తులు సర్పంచ్ అనుముల భాస్కర్‌ను అభినందిస్తూ కొనియాడారు.

## సోనియమ్మ దయతోనే


# తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు

- డిసిసి అధ్యక్షులు, తోటకూర వజ్రేష్ యాదవ్,మేడ్చల్ జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )**మేడ్చల్ జిల్లా కేంద్రంలోని మేడ్చల్ పట్టణంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్,మేడ్చల్ జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్,సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రం ఏర్పడిందంటే అది సోనియమ్మ దయ వల్లేనని రాష్ట్రాన్ని ఇచ్చిన ఘనత సోనియా గాంధీ కే దక్కుతుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజల స్వాభిమానాన్ని నిలిపిందని గోదావరి, సరస్వతి పుష్కరాలు, తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ మేధావులకు గౌరవ వేతనం,కళాకారులకు ప్రోత్సాహం,రచయితలకు,కవులకు సముచిత గౌరవం కల్పించింది. ప్రజా పాలన అంటే కాంగ్రెస్ పాలనేబి అని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మకంగా ఇచ్చిందని,తెలంగాణ ప్రజలు సోనియా గాంధీ కి ఎప్పటికీ కృతజ్ఞతతో ఉండాలని తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్,సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్,మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి,మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి,గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్ కురుమ,మేడ్చల్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఈగ శ్వేత రాజు ముదిరాజ్,రేగు రాజు కురుమ,దుర్గం శివ శంకర్ ముదిరాజ్,మేడ్చల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు చీర్ల రమేష్ కురుమ,జాకట దేవరాజ్,కౌడే మహేష్ కురుమ,రొయ్యపల్లి మల్లేష్ గౌడ్,ఫిలిప్స్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్నగారి రాఘవేందర్ గౌడ్,నడికొప్పు రంజిత్ ముదిరాజ్,గుర్కాల సురేందర్ ముదిరాజ్,మేకల రాజశేఖర్ రెడ్డి (బబ్లూ),కనకాల నాగభూషణం (బుషి),గువ్వ రవి ముదిరాజ్,గోమారం బాల్ రెడ్డి,నడికొప్పు బాల మల్లేష్ ముదిరాజ్,ధాత్రిక లింగం వంజరి,ఉదండపురం సత్యనారాయణ,కర్కల వరధా రెడ్డి,రామన్నగారి సంతోష్ గౌడ్,సద్ది ప్రకాష్ రెడ్డి,చెర్వుకొమ్ము శేఖర్ గౌడ్,వేముల రంజిత్ రెడ్డి,మేడ్చల్ మున్సిపాలిటీ ఎస్ సి సెల్ అధ్యక్షులు దండు శ్రీకాంత్ (చింటు),మేడ్చల్ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లవంగు రాకేష్ వంజరి,మేడ్చల్ మున్సిపాలిటీ ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షులు గుండ శ్రీధర్ కురుమ,మేడ్చల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,యువకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మారెడ్ పల్లిలో "మర్డర్""4"రు అరెస్టు:గోపాలకృష్ణ



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** నగరంలో యువత పెడదారి పడుతూ సమస్యలకు కేంద్ర బిందువుగా మారుతున్నారు. అదిగాక మత్తు వ్యసనాలకు దగ్గరై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. హైద్రాబాద్‌జంటనగరాల్లో క్రైం రెట్లో అత్యధికంగా యువతనే ఉండడం విశేషం. మరీ ముఖ్యంగా ఓరవై సంవత్సరాల నుంచి "25"ఏళ్ల వయస్సు గల వ్యక్తులే నేర చరిత్రలో బాగం కావడం అధికారులకు తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో మారేడుపల్లి పిఎస్ పరిధిలో జరిగిన హత్య కేసును పోలీసులు 24 గంటల్లోనే చేదించారు. ఈ కేసులో సాయి నిఖిల్ తో సహా మరో ముగ్గురుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు బేగంపేట ఏసిపి గోపాల కృష్ణమూర్తి విలేకరుల సమావేశంలో తెలిపారు. నిందితుల నుండి 30 సెంటీమీటర్ల కత్తితోపాటు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఘట్కేసర్ లో బీటెక్ రెండవ సంవత్సరం వరకు చదివి మానేసిన నిఖిల్ గంజాయి వ్యసనపరుడై తన స్నేహితులతో కలిసి ఈ దారుణానికి ఒడగట్టినట్లు పోలీసులు తెలిపారు. వ్యక్తిగత విభేదాలు పాత కక్షల కారణంగానే మారేడుపల్లి పీఎస్ పరిధి సంజీవయ్య నగర్ లో శ్రవణ్ హత్య జరిగినట్లు బేగంపేట ఏసిపి గోపాలకృష్ణమూర్తి తెలిపారు. సంజీవయ్య నగర్ లో నివాసం ఉండే నిఖిల్ కొంతకాలంగా శ్రవణ్ సోదరి పట్ల అసభ్యకరంగా దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలిందని తెలిపారు. మొన్న సాయంత్రం భువనగిరిలో ఫంక్షన్ కు వెళ్లిన అనంతరం అతిగా మద్యం సేవించి సంజీవయ్య నగర్ కు వచ్చారు. అప్పటికే గంజాయి మత్తులో ఉన్న సాయి నిఖిల్ శ్రవణ్ సోదరితో అసభ్యంగా సైగలు చేసి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె తండ్రి పరుశురాం నిఖిల్ ను వారించాడు. జై భవాని ఫ్లవర్ డెకరేషన్ వ్యాపారం నిర్వహిస్తూ అప్పుడే విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన శ్రవణ్ విషయం తెలుసుకొని గొడవకు గల కారణమేమిటో మాట్లాడేందుకు నిఖిల్ దగ్గరకు వెళ్ళగా శ్రవణ్ ను అడ్డగించి అతనిపై విచక్షణ రహితంగా దాడి చేశారు. నిఖిల్ ఇంట్లో నుండి కత్తి తీసుకువచ్చి శ్రవణ్ చాతి, నడుము భాగంలో పలుమార్లు కత్తితో పొడవడంతో తీవ్ర రక్తస్రావమై గాయాల య్యాయి. హుటాహుటిన స్థానికులు శ్రవణ్ ను గాంధీ ఆసుపత్రికి తరలించడంతో చికిత్స పొందు తూ అతను ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనకు కారకులైన సాయి నిఖిల్ తో పాటు ఆనంద్ సాయినాథ్ రమేష్ లను పోలీసులు జూబ్లీ బస్ స్టేషన్ వద్ద అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ప్రధాన నిందితుడు నిఖిల్ పై గతంలో కేసు ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. మాదకద్రవ్యాల వినియోగం, అసాంఘిక కార్యకలాపాలు, గొడవలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలను నిరోధించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో మారెడ్ పల్లి ఇన్స్పెక్టర్ నోముల వెంకటేష్, ఎస్సైలు నవీన్,సంధ్య,రంజీత్, ఏఎస్సై లింగ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో దక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు



**శ్రీ కాళహస్తి,(ప్రశ్న న్యూస్)** శ్రీకాళహస్తి క్షేత్రంలో గురు గ్రహ మార్పు సందర్భాన్ని పురస్కరించుకుని గురు దక్షిణామూర్తి స్వామి వారికి విశేష పూజలు, హోమాలు నిర్వహించడం అత్యంత ప్రాముఖ్యమైన ఘట్టం. నవగ్రహాలలో ఒకరైన గురు భగవానుడు ఒక రాశి నుండి మరొక రాశిలోకి ప్రవేశించేటప్పుడు ఈ ఆలయంలో శ్రీకాళహస్తిలో దక్షిణామూర్తి సాధారణంగా అన్ని ఆలయాలలో దక్షిణామూర్తి స్వామి వారి విగ్రహం చాలా పెద్దదిగా, ఒక ప్రత్యేక ఆలయం వలె భక్తులకు దర్శన మిస్తుంది. ఇక్కడ స్వామి వారు జ్ఞానాన్ని ప్రసాదించే గురువుగా పూజలందుకుంటారు. అందువల్ల గురు దోషాలు ఉన్నవారు, జాతకంలో గురు బలం పెరగాలనుకునే వారు ఇక్కడికి వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. గురు సంక్రమణం (మిథునం నుండి కర్కాటకం)గురు గ్రహం ఒక రాశి నుండి మరొక రాశిలోకి మారే క్రమంలో, జాతక చక్రం ప్రకారం కొన్ని రాశుల వారికి అనుకూల ఫలితాలు, మరికొన్ని రాశుల వారికి మిశ్రమ ఫలితాలు ఉంటాయి. విశేష హోమాలు గురుడు మారే పుణ్యకాలంలో ఆలయ ప్రాంగణంలో వేద పండితుల ఆధ్వర్యంలో లక్షార్చనలు, నవగ్రహ శాంతి హోమాలు, గురు శాంతి హోమాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. అభిషేకాలు స్వామి వారికి పాలు, పెరుగు, తేనె, చందనం, మరియు వివిధ రకాల పండ్ల రసాలతో విశేష అభిషేకాలు జరిపి, పసుపు రంగు వస్త్రాలు, శనగలతో చేసిన మాలలతో అలంకరిస్తారు. భక్తులు చేయవలసిన పరిహారాలుగురు మార్పు వల్ల ఇబ్బందులు పడే రాశుల వారు ముఖ్యంగా జన్మ గురువు లేదా అశుభ స్థానాల్లో గురు సంచారం ఉన్నవారు పూజలు చేయడం ద్వారా శుభ ఫలితాలు పొందుతారు. గురు దక్షిణామూర్తి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, హారతులు ధూప దీప నైవేద్యాలతో వైభవంగా పూజా కార్యక్రమం. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ కరుణాకర్ గురుకుల్ ఆధ్వర్యంలో నిర్వహణ. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు, పుర ప్రజలు మంగళవారం సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడం శ్రీకాళహస్తీ దేవస్థానం ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహణ భక్తులు స్వామివారి దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరణ.

## మేడ్చల్ బిఆర్ఎస్‌లో తారాస్థాయికి

# చేరుతున్న విభేదాలు

- సొంత పార్టీ నేతలే తిరుగుబాటు
- మొన్న కార్యకర్త ల సమావేశంలో... నేడు జయశంకర్ విగ్రహం వద్ద
- ఎమ్మెల్యే మల్లారెడ్డి కి వ్యతిరేకంగా నినాదాలు
- ఉద్యమకారులకు ప్రాధాన్యత దక్కడం లేదంటూ ఆరోపణలు



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ బిఆర్ఎస్ లో విభేదాలు తారాస్థాయికి చేరుతున్నాయి. మొన్న ఉమ్మడి మండల కార్యకర్తల సమావేశంలో సొంత పార్టీ నేతలే మేడ్చల్ బిఆర్ఎస్ పార్టీ నేతలపై విమర్శల వర్షం కురిపించారు. మళ్లీ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కేఎల్ఆర్ వెంచర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద ఆ నేతలే మళ్లీ విమర్శల గలం విప్పారు. ఇక్కడ ఒక అడుగు ముందుకేసి ఎమ్మెల్యే మల్లారెడ్డి పై విమర్శల వర్షం కురిపించారు. బి ఆర్ ఎస్ పార్టీ ఆవిర్భావం నుండి తెలంగాణ కోసం పోరాడిన నేతలకు మేడ్చల్ బి ఆర్ ఎస్ పార్టీలో గుర్తింపు ఉండడం లేదని, వేరే పార్టీల నుండి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తూ ఉద్యమకారులకు అన్యాయం చేస్తున్నారని సదరు నేతలు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి మేడ్చల్ మండల కార్యకర్తల సమావేశం నుండి ప్రారంభమైన వివాదం ముదురుతుంది. ప్రొఫెసర్ జయశంకర్ మెమోరియల్ ట్రస్ట్ ను ఏర్పాటు చేసి ఉద్యమకారులను ఏకతాటిపై తీసుకొచ్చే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇది మా కుటుంబ సమస్య అని, కూర్చొని పరిష్కరించుకుంటామని మేడ్చల్ మల్కాజ్గిరి పార్లమెంటు ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి ప్రకటించినప్పటికీ అవేవీ సఫలం కానట్లు తెలుస్తోంది. మళ్లీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద మేడ్చల్ బిఆర్ఎస్ నేతలపై ఆరోపణలు రావడం వల్ల మేడ్చల్ బిఆర్ఎస్ పార్టీలో అసంతృప్తుల సంఖ్య పెరుగుతున్నట్లు తెలుస్తోంది. పరిస్థితిని ఇలానే వదిలేస్తే రాబోయే రోజులలో ఆ పార్టీలో మరింత అసంతృప్తి జ్వాలలు పెరిగే అవకాశం ఉందని ఆ పార్టీకి చెందిన ఓ సీనియర్ నేత ( పేరు చెప్పడానికి ఇష్టపడని) పేర్కొంటున్నారు.

### ఈసారి ఎమ్మెల్యే మల్లారెడ్డి కి నిరసన సెగ

ఈసారి ఎమ్మెల్యే మల్లారెడ్డి కి నిరసన తగిలింది. మేడ్చల్ బిఆర్ఎస్ లో ఉద్యమకారులను గుర్తించడం లేదని నిరసన తెలిపినప్పటికీ ఎమ్మెల్యే మల్లారెడ్డి స్పందించకపోవడంపై ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్టీలో జరుగుతున్న ఉద్యమకారుల ఆవేదనను అర్థం చేసుకోవడం లేదు అంటూ ఉద్యమకారులు విమర్శిస్తున్నారు. పార్టీని ఒక తాటిపై నడపాల్సిన ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారంటూ విమర్శలు గుప్పిస్తున్నారు.

## ఎల్లంపేట మున్సిపాలిటీలో ఘనంగా

# రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపాలిటీలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల ను ఘనంగా నిర్వహించారు. ఎల్లంపేట మున్సిపల్ కార్యాలయంలో 12వ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని దేశభక్తి ఉత్సాహంతో జరుపుకున్నారు. చైర్‌పర్సన్ శ్రీదేవి చేతుల మీదుగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వార్డు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, మాజీ వార్డు సభ్యులు, కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పౌరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం చేసిన త్యాగాలను గుర్తుచేసుకుని, రాష్ట్ర అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశభక్తి గీతాలను ఆలపించి, పాల్గొన్న వారందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు.

## ఆవిర్భావం రోజున మహిళలకు

# చీరల పంపిణీ: ఎమ్మెల్యే

- తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావదినోత్సవం సందర్భంగా కంటోన్మెంట్ లో చీరలు పంపిణీ భారీగా తరలివచ్చిన మహిళామణులు:ఎమ్మెల్యే



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)**తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిన్న మంగళవారం రోజున సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్ లో రాష్ట్ర ప్రభుత్వం తరపున కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ నియోజకవర్గ మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు కట్టుబడి ఉందని,మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తోందని ఆయన ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో తెలిపారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తోందని, మహిళలు ప్రభుత్వాలపై ఆధారపడకుండా,సర్కారుకే పన్నులు కట్టే స్థాయికి ఎదగడమే లక్ష్యంగా పని చేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గతంలో మహిళలకు నాసిరకం చీరెలు ఇచ్చి చేతులు దులుపుకోకుండా,కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యమైన చీరెలను అందించి మహిళలను నిజంగా గౌరవిస్తోందని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చినందుకు సోనియా గాంధీకి రాష్ట్ర ప్రజల తరపున ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు భాగ్యశ్రీ,మంజు,ఉషారాణి, ఓబీలు,ఆర్పీలు, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముప్పిడి మధుకర్, మురళీ ముదిరాజ్,శరత్, సంతోష్ కుమార్,రాము, సంతోష్ యాదవ్, టిఎమ్మార్పీఎస్ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా కన్వీనర్ ఇటుక గోపి,దర్గ రవి,శ్రీకాంత్, సదానంద్,నాగినేని సరిత,బచ్చన్ రాజు, బల్వంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రొబేషనరీ ఐఏఎస్‌లకు టౌన్ ప్లానింగ్ పై శిక్షణ: వెంకటేష్



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) దేశంలో బ్యూరో కాడ్స కి ఓప్రత్యేకత ఉంటుంది. పరిపాలన అస్తవ్యస్తంగా ఉన్నప్పుడు చాకచక్యంగా పరిష్కరించే విధంగా అధికారులు సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటారు. అలాగే సమాజంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పాలకులకు సలహా సూచనలు ఇస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈనేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆరు మంది ఐఏఎస్ 1).ఎ.సాయి శివాణి 2). సచిన్ బస్వరాజు గుంటూరు 3). నెల్లూరు శ్రీకాంత్ రెడ్డి 4). పోతరాజు హరి ప్రసాద్ 5).పీ.కుమార్6).పీ.సురేష్ నిన్న హైదరాబాద్ జిల్లా సికింద్రాబాద్ డివిజన్ తిరుమల గిరి మండలంలో "టౌన్ ప్లానింగ్ విభాగం"పై శిక్షణ తరగతులు నిర్వహించారు. అలాగే తిరుమల గిరి,మారెడ్ పల్లి మండల్ సర్వేర్లు మల్లీ.వెంకటేశం,శ్రీనివాస చారి కలిసి "6"మంది ఐఏఎస్ ఆఫీసర్స్ కి వార్డ్ నెంబర్:119 బ్లాక్:బి టౌన్ సర్వే ఒకటి నుంచి పన్నెండు వరకు రికార్డు ఆఫ్ మెజర్మెన్స్ పై అవగాహన కల్పించారు. నిన్న మధ్యాహ్నం రెండు గంటలకు మొదలై సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ సదస్సు కొనసాగాయి. ప్రత్యక చొరవతో ఈ సదస్సును నిర్వహించినతిరుమల గిరి,మారెడ్ పల్లి మండలం సర్వేర్లు,జిల్లా సర్వేర్ చాంద్ పాషా, డిప్యూటీ ఇన్స్పెక్టర్ సికింద్రాబాద్ డివిజన్ బుచ్చయ్య వీరందరూ కలిసి ఆరు మంది ఐఏఎస్ అధికారులకు శిక్షణ తరగతులు ఇవ్వడం జరిగింది.

## మేడ్చల్ జిల్లాలో ఘనంగా

# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

- జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించిన ప్రభుత్వ సలహాదారు డా.కె.కేశవరావు



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ జిల్లాలో జిల్లా సమీకృత కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ప్రభుత్వ సలహాదారులు డా. కే. కేశవరావు ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, డిసిపి సురేష్ కుమార్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. కె. కేశవరావు మాట్లాడుతూ జిల్లాలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను, వాటి పురోగతిని సందేశం ద్వారా వివరించారు. జిల్లాలోని అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తద్వారా గూడులేని పేదలకు నీడకల్పించి వారి భవిష్యత్తుకు భరోసాకల్పిస్తున్నట్లు ఆయన పేర్నొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని మన దేశంలోనే కాక, ప్రపంచ స్థాయిలో నెంబర్ వన్ గా నిలిపేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ -2047 విజన్ తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి ఆర్థిక, సామాజిక, పరిపాలన రంగాల్లో ఆదర్శవంతమైన లక్ష్యాలతో తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యుమెంట్ ను రూపొందించటం జరుగుతుందన్నారు. ఇది తెలంగాణ రూపురేఖలనే మార్చేస్తుందని, రాష్ట్రాన్ని క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ ), ప్యూర్ (పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ ), రేర్ (రూరల్ అగ్రికల్చరల్ రీజియన్ ఎకానమీ ) గా వర్గీకరించుకుని వాటి పరిధిలో సేవా, తయారీ, వ్యవసాయరంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా ఎదగడానికి ప్రణాళికలు రూపొందిశీచటం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌తో కలిసి తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన ముగ్గురి కుటుంబ సభ్యులను శాలువా, పండ్ల బోకే తో సన్మానించారు. అంతకుముందు కీసర చౌరస్తాలోని తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నాము వద్ద పూల గుచ్ఛాలతో జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కీసర ఎంఆర్ఓ యాదగిరిరెడ్డి లు అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ వేడుకలలో డిఆర్ ఓ మాలతి, ఇంచార్జ్ మైనార్టీ అధికారి జి. కాంతమ్మ, కలెక్టరేట్ ఎఓ సుజాత, వ్యవసాయ శాఖ చంద్రకళ, సివిల్ సప్లై శాఖ డియం. సుగుణబాయి, డియస్ ఓ శ్రీనివాసరెడ్డి డిఆర్డిఓ సాంబశివరావు, ఎస్సీ సంక్షేమ శాఖాధికారి వినోద్ కుమార్, ఇంటర్మీడియెట్ అధికారి కిషన్, డిటిఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్లోన్నారు.

# ‘హయగ్రీవ’ మూవీ రివ్యూ!



కన్నడలో ‘ధన్వీర’ కథానాయకుడిగా నటించిన సినిమానే ‘హయగ్రీవ’. రఘు కుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఫిబ్రవరి 26వ తేదీన థియేటర్లకు వచ్చింది. క్రైమ్ థ్రిల్లర్ జోనర్లో రూపొందిన ఈ సినిమాలో కథానాయికగా సంజనా ఆనంద్ నటించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 27వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, మే 22వ తేదీ నుంచి ‘అమెజాన్ ప్రైమ్’లో స్ట్రీమింగ్ అవుతోంది. ప్రస్తుతం ఈ సినిమా కన్నడలో మాత్రమే అందుబాటులో ఉంది. బెంగుళూర్ లో క్రైమ్ బ్రాంచ్ కి సంబంధించిన పోలీస్ ఆఫీసర్ గా అర్జున్ హయగ్రీవ (ధన్వీర) పనిచేస్తుంటాడు. ఆయన భార్య ఐశ్వర్య ( సంజనా ఆనంద్) ఒక కార్పొరేట్ హాస్పిటల్లో డాక్టర్ గా ఉంటుంది. పెళ్లి తరువాత అర్జున్ హయగ్రీవ మరింత బిజీ అవుతాడు. సిటీలో వరుస హత్యలు జరుగుతూ ఉంటాయి. శవాలు లభిస్తున్న తీరు పోలీసులను సైతం కంగారు పెడుతూ ఉంటుంది. మనిషి దేహానికి మృగాల .. జంతువుల ‘తల’ను అమర్చడం చూసి ప్రజలు భయభ్రాంతులకు గురవుతుంటారు. హంతకుడు ఒక సైకో. అతను ఒక్కడే ఈ హత్యలను చేస్తున్నాడనే విషయం హయగ్రీవకి నిర్ధారణ అవుతుంది. హంతకుడికి వైద్య శాస్త్రంపై మంచి అవగాహన ఉందనే విషయం అర్థమవుతుంది. అయితే అతను ఎందుకు ఈ హత్యలను చేస్తున్నాడు? మనిషి తలను తీసేసి, జంతువుల తలలను ఎందుకు పెడుతున్నాడు? అనేది హయగ్రీవకి అర్థం కాదు. ఎలాంటి ఆధారాలు లభించకపోయినా, ఆ సైకో కిల్లర్ గురించి గాలించడం మొదలుపెడతాడు. అసలు ఆ సైకో కిల్లర్ ఎలా ఉంటాడు? హత్యలు చేయడానికి ఎవరిని ఎలా ఎంచుకుంటున్నాడు? శరీరం నుంచి తలను వేరు చేసి .. జంతువుల ‘తల’ను తగిలించే ఈ కార్యక్రమాన్ని అతను ఎక్కడ చేస్తున్నాడు? అనే విషయాన్ని కనుక్కోవడానికి హయగ్రీవ ఒక ప్లాన్ చేస్తాడు. అదేమిటి? తన కోసం హయగ్రీవ తీవ్రంగా గాలిస్తున్నాడని తెలుసుకున్న ఆ సైకో ఏం చేస్తాడు? అసలు అతను ఇదంతా ఎందుకు చేస్తున్నాడు? అనే ఆసక్తికరమైన అంశాలతో కూడుకున్న కథ ఇది.

పిల్లలు ఎదుగుతున్నప్పుడే వాళ్ల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. ఏ విషయాన్ని వాళ్లు ఎలా తీసుకుంటున్నారు? ఎలా ఆలోచిస్తున్నారు? అనేది పరిశీలన చేస్తూ ఉండాలి. లేదంటే ఇతరులకంటే తేడాగా తాము ఆలోచన చేస్తున్నామనే విషయం మరిచిపోయి, తాము నమ్మినదే చేస్తూ సైకోలుగా మారిపోతారు. అలాంటి ఒక సైకో కిల్లర్ చుట్టూ తిరిగే కథ ఇది. అతణ్ణి పట్టుకోవడానికి పరిగెత్తే ఒక పోలీస్ ఆఫీసర్ కథ ఇది. ధైర్యవంతుడైన ఒక సిన్సియర్ పోలీస్ ఆఫీసర్ .. భయమనేది తెలియని ఒక ‘సైకో పాత్’ చుట్టూ దర్శకుడు ఈ కథను అల్లుకుంటూ వెళ్లాడు. సైకోలు ఎలాంటి ప్రత్యేకతలతో కనిపించరు. చాలా సాధారణంగా కనిపిస్తూనే, దారుణాలకు పాల్పడుతూ ఉంటారు. అందువలన వాళ్లను గుర్తించడానికీ .. పట్టుకోవడానికి పోలీసులు నానా అవస్థలు పడుతుంటారు. ఈ కథ కూడా అదే పద్ధతిలో నడుస్తుంది. ఇక ఒక వ్యక్తి సైకోగా మారిపోవడానికి వెనుక ఒక బలమైన కారణం ఉంటుంది. అలాంటి ఒక కారణం ఈ సినిమాలో ఫ్లాష్ బ్యాక్ గా వస్తుంది. కారణంగా అంత బలంగా లేని ఈ ఎపిసోడ్, ఓ మాదిరిగా అనిపిస్తుంది. ఇక సైకో ఎటాక్ చేయడం .. హత్యలు చేయడం వంటి సన్నివేశాలు పరమ రొటీన్ గా అనిపిస్తాయి. పోస్టుమార్టం టేబుల్ పై శవాలను .. తలలేని మొండాలను క్లోజప్ లో చూపించడం కాస్త ఇబ్బంది పెడుతుంది. ఇలాంటి కథల్లో అసలు ఈ హత్యలు ఎవరు చేస్తున్నారనేది దర్శకుడు రివీల్ చేసేవరకూ ఆడియన్స్ కి తెలియకూడదు. కానీ దర్శకుడు ముందుగానే చూపించిన ఒక్క సీన్ వలన ఆ ఇంపాక్ట్ పోయిందని అనిపిస్తుంది. ఒక రకంగా అది స్క్రీన్ ప్లే లోని లోపంగానే చెప్పుకోవాలి. ఆయా పాత్రలను ఆడియన్స్ అనుమానించేలా ఆ పాత్రలతో ఒక చిన్న ‘లుక్’ ఇప్పించడం సిల్లీగా అనిపిస్తుంది. కథ పాతదే .. కథనం కూడా పాత పద్ధతిని ఫాలో అయిందే. పోలీస్ ఇన్వెస్టిగేషన్ కి సంబంధించిన హడావిడి లేకుండా తాపీగా నడవడమే ఈ కథలోని లోపాలలో ముఖ్యమైనదిగా చెప్పుకోవాలి. ప్రీ క్లైమాక్స్ .. క్లైమాక్స్ సమయాలలోను కథనం వేగాన్ని పుంజుకోలేదు. కథను పురాణాలతో లింక్ చేసిన తీరు కొత్తగా అనిపిస్తుంది గానీ .. దానిని కనెక్ట్ చేయలేకపోయారు. ధన్వీర నటన బాగానే ఉంది. సంజనా ఆనంద్ చేయడానికేమీ లేదు. సైకో పాత్రను పోషించిన ఆర్టిస్ట్ నటన ఫరవాలేదు. మిగతా పాత్రలకు ఎలాంటి ప్రాధాన్యత లేదు. గిరీశ్ గౌడా ఫొటోగ్రఫీ బాగుంది. జుదా శాండీ సంగీతం ఓ మాదిరిగా అనిపిస్తుంది. ప్రకాశ్ ఎడిటింగ్ ఫరవాలేదు. ఒక సైకో .. అతణ్ణి ప్రభావితం చేసే ఒక ఫ్లాష్ బ్యాక్ .. ఆ సైకోను పట్టుకోవడానికి పోలీస్ ఆఫీసర్ డిజైన్ చేసే వ్యూహాలు .. చివరికి ఉచ్చులో పడేలా చేయడం .. వంటి కథలతో గతంలో చాలానే కథలు వచ్చాయి. ఆ కథలకు ఏ మాత్రం భిన్నంగా లేని సినిమా ఇది. రొటీన్ కథను రొటీన్ గానే చెప్పిన కంటెంట్ ఇది.

## హీరో విజయ్‌తో రిలేషన్ రూమర్స్..

### పరోక్షంగా కౌంటర్ ఇచ్చిన నటి త్రిష!



తమిళనాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్‌తో నటి త్రిష రిలేషన్‌లో ఉన్నారంటూ వస్తున్న వార్తలు కొన్ని రోజులుగా సినీ, రాజకీయ రంగాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. సాధారణంగా తన వ్యక్తిగత విషయాలపై వచ్చే రూమర్లపై స్పందించని త్రిష, తాజాగా సోషల్ మీడియా వేదికగా పరోక్షంగా స్పందించారు. తన పెంపుడు కుక్క ఫొటోను షేర్ చేస్తూ.. “నా వ్యక్తిగత విషయాల్లో తలదూర్చడానికి దీన్ని మాత్రమే అనుమతిస్తాను” అంటూ ఆసక్తికరమైన క్యాప్షన్ పెట్టారు. నేరుగా ఎవరి పేరు ప్రస్తావించకపోయినప్పటికీ, తనపై అసత్య ప్రచారాలు చేస్తున్న వారికి కౌంటర్‌గానే ఈ పోస్ట్ పెట్టారని అభిమానులు భావిస్తున్నారు. మరోవైపు, మే నెల జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ త్రిష చేసిన “మ్యాజికల్ మే” పోస్ట్ కూడా నెట్టింట వైరల్ అవుతోంది. ఈ ఏడాది మే నెలను తలచుకున్నప్పుడల్లా తన ముఖంపై చిరునవ్వు వస్తూనే ఉంటుందని ఆమె పేర్కొన్నారు. మే నెలలోనే త్రిష పుట్టినరోజు ఉండడం, అదే సమయంలో తన ఆప్తమిత్రుడు విజయ్ తమిళనాడు ఎన్నికల్లో ఘన విజయం సాధించి సీఎం కావడం విశేషం. దీనికి తోడు ఆమె నటించిన ‘కరుప్పు’ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ హిట్‌గా నిలిచి 348 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ వరుస విజయాల వల్లే ఆమె ఈ పోస్ట్ పెట్టారు.

## కృష్ణ ఫ్యాన్స్‌ను మెప్పిస్తున్న

## కుర్రాడి కటౌట్!

తెలుగు ఇండస్ట్రీ ఎప్పటికీ మరిచిపోలేని హీరో కృష్ణ. ఆయన చేసిన సినిమాలే కాదు .. సాహసోపేతమైన నిర్ణయాలు .. ప్రయోగాలు అలా మైలురాళ్లను సెట్ చేసి పెట్టాయి. ఆ ఫ్యామిలీ నుంచి వచ్చిన మహేశ్ బాబు మరో సూపర్ స్టార్ గా తన హవా కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మహేశ్ బాబు అన్న రమేశ్ బాబు కొడుకు ‘జయకృష్ణ’ కూడా హీరోగా ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అవుతున్నాడు. ‘శ్రీనివాస మంగాపురం’ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ‘ RX 100’ సినిమాతో ఒక భారీ హిట్ ఇచ్చిన అజయ్ భూపతి, ఆ తరువాత కూడా తన మార్క్ సినిమాలను ఆడియన్స్ కి పరిచయం చేశాడు. ఆయన దర్శకత్వం వహించిన ‘శ్రీనివాస మంగాపురం’ సినిమాతో జయకృష్ణ హీరోగా



పరిచయమవుతున్నాడు. యాక్షన్ తో కూడిన రొమాంటిక్ లవ్ స్టోరీ ఇది. రీసెంటుగా వదిలిన ఈ సినిమా ‘గ్లింప్స్’ చూసినవాళ్ల నుంచి జయకృష్ణకి మంచి మార్కులే పడుతున్నాయి. కటౌట్ కరెక్టుగానే ఉందని చెప్పుకుంటున్నారు. సైడ్ నుంచి అచ్చు రమేశ్ బాబులా కనిపిస్తున్న జయకృష్ణ, నటన పరంగా తనదైన ప్రత్యేకతను చాటుకుంటాడేమో చూడాలి. ఈ సినిమాతో రవీనా టాండన్ కూతురు ‘రషా థడాని’ హీరోయిన్ గా పరిచయమవుతోంది. బాలీవుడ్ బ్యూటీ అనిపించుకున్న రవీనాకి తెలుగులో ‘బంగారు బుల్లోడు’ .. ‘రథసారధి’ వంటి హిట్స్ ఉన్నాయి. ఇక ఇప్పటి యూత్ ను అలరించడానికి రషా థడాని సిద్ధమవుతోంది. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా, జులై 9వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాతో ఈ కొత్త జంట దూసుకుపోతుందేమో చూడాలి.

## నీ అందంతో సినిమాను ప్రమోట్ చెయ్..

### ‘నేషనల్ క్రష్’ నటికి కంగనా ఫన్నీ సలహా



బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ తన సహనటికి సరదాగా ఓ సలహా ఇచ్చారు. ‘భారత్ భాగ్య విధాత’ అనే తమ కొత్త సినిమా ప్రమోషన్‌లో భాగంగా, నటి గిరిజా ఓక్‌ను ఉద్దేశించి “నీ దాన్ని ఉపయోగించి మన సినిమాను ప్రమోట్ చెయ్యి” అంటూ చమత్కరించారు. ఇటీవల ‘నేషనల్ క్రష్’గా సోషల్ మీడియాలో వైరల్ అయిన గిరిజా, ఆ ట్యాగ్‌పై తన అభిప్రాయం వ్యక్తం చేస్తున్న సమయంలో కంగనా ఈ వ్యాఖ్యలు చేశారు. ‘భారత్ భాగ్య విధాత’ సినిమా ప్రమోషన్ కోసం ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో గిరిజా ఓక్ సోషల్ మీడియా పాపులారిటీపై చర్చ జరిగింది.

గతేడాది ఓ పాడ్‌కాస్ట్‌కు సంబంధించిన క్లిప్‌లో గిరిజా నీలం రంగు చీరలో కనిపించారు. ఆ వీడియో ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవ్వడంతో, నెటిజన్లు ఆమెను ‘బ్లూ శారీ గర్ల్’ అని, ‘నేషనల్ క్రష్’ అని పిలవడం ప్రారంభించారు.

ఈ విషయం ప్రస్తావనకు రాగానే, కంగనా కూడా “ఆ బ్లూ శారీ సంగతేంటి? నేను కూడా విన్నాను” అని ఆసక్తిగా అడిగారు. తనకు వచ్చిన ఈ గుర్తింపుపై గిరిజా ఓక్ వినమ్రంగా స్పందించారు. “ఆ వీడియో ఎందుకు వైరల్ అయిందో నాకు అర్థం కాలేదు. అందులో ఎలాంటి లాజిక్ లేదు. చాలా మంది నా అందం గురించి కామెంట్లు చేశారు.

కానీ, నా రూపం నా ఘనత కాదు. అది నా జన్యువుల వల్ల వచ్చింది. నా అందంలో నేను సంపాదించుకున్నది ఏమీ లేదు” అని ఆమె వివరించారు. గిరిజా సమాధానం విన్న కంగనా, “నువ్వు నా సినిమాలో ఉన్నందుకు చాలా సంతోషంగా ఉంది. దయచేసి నీ అందాన్ని ఉపయోగించి సినిమాను ప్రమోట్ చెయ్యి” అని నవ్వుతూ అన్నారు. దీనిపై గిరిజా స్పందిస్తూ, “దేనికైనా ‘నేషనల్’ అని గుర్తింపు రావాలంటే సర్టిఫికెట్ ఉండాలి. కంగనాకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం సబబే. కానీ నన్ను ‘నేషనల్ క్రష్’ అనడంలో ఎలాంటి ప్రామాణికత లేదు” అని స్పష్టం చేశారు. మనోజ్ తపాడియా దర్శకత్వం వహించిన ‘భారత్ భాగ్య విధాత’ చిత్రం జూన్ 12న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సినిమాలో కంగనా రనౌత్, గిరిజా ఓక్‌లతో పాటు స్మితా తాంబే, ఇషా డే, ప్రియా బెర్డే, ఆశా షెలార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## ప్రేమకథలో కొత్త మలుపు



గాయని సునీత తనయుడు ఆకాష్ హీరోగా నటిస్తున్న చిత్రం ‘కొత్త మలుపు’. శివవరప్రసాద్ కేశనకుర్తి దర్శకుడు. భైరవి ఆర్ధ్యా కథానాయికగా నటిస్తున్నది. ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకురానుంది. మైత్రీ మూవీ మేకర్స్ రిలీజ్ చేస్తున్నది. సోమవారం ట్రైలర్‌ను ఆవిష్కరించారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో ప్రేమ, వినోదం, సస్పెన్స్ సమపాళ్లలో ఉంటాయని, నాయకానాయికలు బావామరదళ్లుగా కనిపిస్తారని దర్శకుడు తెలిపారు. తెరపై కోనసీమ అందాలను ఆవిష్కరిస్తూ చక్కటి వినోదంతో ఆకట్టుకుంటుందని నిర్మాత పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సీనియర్ నటుడు భానుచందర్, గాయని సునీత, నిర్మాత సి.కల్యాణ్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ చిత్రానికి కెమెరా: సుమంత్ కాచర్ల, జవహర్ రెడ్డి, సంగీతం: యశ్వంత్‌నాగ్, దర్శకత్వం: శివ వరప్రసాద్ కేశనకుర్తి.

## దుష్టశిక్షణలో స్వయంభూ

నిఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా ‘స్వయంభూ’. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. సోమవారం హీరో నిఖిల్ పుట్టినరోజు సందర్భంగా స్పెషల్ వీడియోను విడుదల చేశారు. ఇందులో యుద్ధవీరుడి పాత్ర కోసం నిఖిల్ చేసిన కఠోర శ్రమను చూపించారు. ఈ సినిమా కోసం నిఖిల్ ప్రొఫెషనల్ ట్రెయినర్ల పర్యవేక్షణలో కత్తియుద్ధం, మార్షల్ ఆర్ట్స్ వంటి విద్యల్లో శిక్షణ తీసుకున్నారని మేకర్స్ తెలిపారు. వీడియో చివరలో చూపించిన విజువల్స్ ఆకట్టుకున్నాయి. వీటిలో యుద్ధ కవచం ధరించిన నిఖిల్ శత్రువులపై విరుచుకుపడటం, అగ్ని జ్వాలల మధ్య పోరాటాలు రోమాంఛితంగా అనిపించాయి. ఈ సినిమాలో నిఖిల్..చోళ యుద్ధ వీరుడి పాత్రలో కనిపించనున్నారని సమాచారం. ఓ సామాన్యుడు చారిత్రక పురుషుడిగా మారే వైనం కథలో ఆసక్తికర అంశమని చెబుతున్నారు. త్వరలో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదలకానుంది. సంయుక్త, నభానటేష్ తదితరులు కీలక పాత్రల్ని పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, నిర్మాతలు: భువన్, శ్రీకర్, రచన–దర్శకత్వం: భరత్ కృష్ణమాచారి.



## తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఎస్వీ కృష్ణారెడ్డి

సకుటుంబ కథాచిత్రాల దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో వస్తున్న 43వ సినిమా ‘వేదవ్యాస్’. కె.అచ్చిరెడ్డి సమర్పణలో కొమ్మూరి ప్రతాపరెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా పిడుగు విశ్వనాథ్ హీరోగా పరిచయం అవుతున్నారు. కొరియన్ నటి జూన్‌హ్యాంజీ, మంగోలియన్ నటుడు షరన్ బోల్డ్ సెగ్మెంట్ తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవుతున్నారు. సోమవారం ఎస్వీకృష్ణారెడ్డి 75వ పుట్టినరోజు సందర్భంగా హైదరాబాద్‌లో వేడుకలను నిర్వహించారు. ఇందులో భాగంగా ‘వేదవ్యాస్’ సినిమా మేకింగ్ వీడియోను లాంచ్ చేశారు. వీటితోపాటు 38 చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించిన దర్శకుడిగా ఎస్వీ కృష్ణారెడ్డికి ‘తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్’ నుంచి వరల్డ్ రికార్డ్ గుర్తింపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్వీకృష్ణారెడ్డితో తమకున్న అనుబంధాన్ని కె.అచ్చిరెడ్డి గుర్తు చేసుకున్నారు. నిర్మాత కొమ్మూరి ప్రతాపరెడ్డి ఈ సినిమాలో భాగమైనందుకు సంతోషం వెలిబుచ్చారు.



# ఎలక్ట్రిక్ బస్సులను విజయవంతంగా నడుపుతూ తెలంగాణ ఆర్టీసీ : ఎండీ నాగిరెడ్డి

- ''మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులు కేటాయించడం ద్వారా వారి ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు చారిత్రాత్మక చేయూత
- ''బస్సుల్లో రద్దీ పెరిగినప్పటికీ అద్భుతంగా సేవలందిస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి ఎండీ నాగిరెడ్డి ప్రత్యేక అభినందనలు
- ''ప్రయాణికుల భద్రతే మన ప్రథమ కర్తవ్యం'' ప్రతి ప్రయాణికుడిని కుటుంబ సభ్యుడిగా భావించి సేవలు అందించాలని సిబ్బందికి పిలుపు
- బస్‌భవన్‌లో ఘనంగా 12వ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12వ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఆర్టీసీ బస్ భవన్ లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించారు. ఎందరో మహానుభావుల త్యాగాల ఫలంగా సిద్ధించిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరిస్తూ, వారికి ఎండీ నాగిరెడ్డి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎండీ నాగిరెడ్డి మాట్లాడుతూ, "తెలంగాణ జెండా అనేది కేవలం ఒక వస్త్రం కాదు, అది కోట్ల మంది ఆత్మగౌరవ నినాదం మరియు లక్షలాది మంది పోరాటాల స్వేచ్ఛా గీతం" అని కొనియాడారు. ప్రగతిని సాధించడంలోనూ దేశంలోనే సాటిలేని రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు అన్ని రంగాల్లో సాధించిన అద్భుత ప్రగతిలో మన తెలంగాణ ఆర్టీసీ కూడా ఒక ముఖ్యమైన భాగస్వామి కావడం మనందరికీ గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఒకనాడు ఎన్నో సవాళ్లతో ఉన్న మన సంస్థ, నేడు ప్రజా రవాణాలో దేశంలోనే ఒక రోల్ మోడల్‌గా నిలిచింది అంటే దానికి కారణం మన ఉద్యోగుల క్రమశిక్షణ, కష్టం మరియు నిబద్ధత మాత్రమేనని అభినందించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకం సంస్థ చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచిందని నాగిరెడ్డి వివరించారు. ఈ పథకం ద్వారా కోట్లాది మంది మహిళలు, విద్యార్థినులు, మరియు ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా, సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ప్రస్తుత తరుణంలో మహిళల ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, అందులో భాగంగానే మహిళలకు రవాణా భారాన్ని తగ్గించడమే కాకుండా వారి ఉపాధి, విద్యా అవకాశాలను మెరుగుపరిచేలా ఈ పథకాన్ని రూపొందించారని తెలిపారు. ఈ మహాలక్ష్మి పథకం ద్వారా మహిళల నుండి అద్భుతమైన స్పందన లభించిందని, సంస్థ ఇప్పటికే విజయవంతంగా 10వేల కోట్ల ఉచిత మహిళా ప్రయాణాలను పూర్తి చేసి సరికొత్త రికార్డు సృష్టించిందని వెల్లడించారు. దీనితో పాటు మహిళా సంఘాలకు బస్సులు కేటాయించడం ద్వారా వారు ఆర్థికంగా ఎంతో బలోపేతం అవుతున్నారని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్థ సేవలని మరింత ఆధునీకరిస్తున్నామని ఎండీ నాగిరెడ్డి తెలిపారు. పర్యావరణ పరిరక్షణను ధ్యేయంగా పెట్టుకుని, కాలుష్య నివారణ కోసం పెద్ద ఎత్తున అధునాతన ఎలక్ట్రిక్ బస్సులను(ఈ బస్) సరికొత్త బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా ఎలక్ట్రిక్ బస్సులను అత్యంత విజయవంతంగా నడుపుతూ తెలంగాణ ఆర్టీసీ అన్ని రాష్ట్రాలకు ఒక ఆదర్శంగా నిలిచిందని గర్వంగా ప్రకటించారు. అలాగే ప్రయాణికుల సౌకర్యార్థం డిజిటల్ చెల్లింపులు, లైవ్ బస్ ట్రాకింగ్ వంటి ఆధునిక సాంకేతిక మార్పులను సంస్థలో విజయవంతంగా అమలు చేస్తున్నట్లు నాగిరెడ్డి స్పష్టం చేశారు. బస్సుల్లో ప్రయాణికుల రద్దీ అనూహ్యంగా పెరిగినప్పటికీ, డ్రైవర్లు, కండక్టర్లు మరియు క్షేత్రస్థాయి సిబ్బంది ఎంతో ఓపికతో, బాధ్యతాయుతంగా సేవలు అందిస్తూ మహాలక్ష్మి పథకాన్ని విజయవంతం చేస్తున్నందుకు మీ అందరికీ నా ప్రత్యేక అభినందనలు అని ఎండీ నాగిరెడ్డి కొనియాడారు. సంస్థ ఎదుగుదలతో పాటు కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం ఎల్లప్పుడూ ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని హామీ ఇచ్చారు. ఉద్యోగుల శ్రేయస్సును కాపాడటంలో, వారి జీతభత్యాలు మరియు ఇతర ప్రయోజనాలను సకాలంలో అందించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ మనకు ఆర్థికంగా, నైతికంగా అండగా నిలుస్తోందని, భవిష్యత్తు లో కూడా కార్మికుల సంక్షేమానికి ఎలాంటి లోటు రానివ్వమని ఈ వేదికగా స్పష్టం చేశారు. ప్రయాణికుల భద్రతే మన ప్రథమ కర్తవ్యం" అని, ప్రమాద రహిత ప్రయాణాన్ని అందించడమే మన ఏకైక లక్ష్యం కావాలని ఎండీ ఉద్ఘాటించారు. బస్సు ఎక్కే ప్రతి ప్రయాణికుడిని మన కుటుంబ సభ్యుడిగా భావించి, మర్యాదపూర్వకమైన సేవలు అందించినప్పుడే ప్రజల్లో సంస్థపై నమ్మకం మరింత పెరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సవాళ్లను అధిగమిస్తూ, లాభాల బాటలోకి పయనిస్తూ, తెలంగాణ ప్రజల గుండెల్లో నమ్మకమైన రవాణా వారధిగా తెలంగాణ ఆర్టీసీని దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెట్టేందుకు మనమంతా పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈడీ సిహెచ్.వెంకన్న, ఫైనాన్సియల్ అడ్వైజర్ విజయ పుష్ప , సిటీఎం శ్రీధర్,సిపిఎం ఉషాదేవి, సిటీఎం ట్రాఫిక్ శ్రీదేవి, కవిత , ప్రభులత పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ ఆత్మ గౌరవాన్ని కాపాడుకుందాం

- గ్రామ సర్పంచ్ : మామిడిశెట్టి సరిత - మునిందర్
- నర్సింగాపూర్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని నర్సింగాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ మామిడిశెట్టి సరిత - మునిందర్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మామిడిశెట్టి సరిత మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అమరవీరుల త్యాగాలు, ప్రజల సుదీర్ఘ పోరాట ఫలితమని అన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ ప్రజలకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎదులాపురం ఆకేష్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షులు లాల్ కనుకయ్య, ఉపాధ్యక్షులు లింగంపల్లి శ్రీనివాస్, తదితర నాయకులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పదవీకాలం ముగిసింది...

## ఇంకా పదవులేంటి? కీర్తి సంతోష్ రాజ్

- భట్రాజు సంఘంలో బైలా బేఖాతర్
- గడువు ముగిసిన కమిటీకి అధికారాలెక్కడివి
- కమిటీ గడువు పూర్తైతే అందరూ పూర్వ సభ్యులే
- హడాక్ కమిటీ ఏర్పాటు చేసి వెంటనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలి
- హైదరాబాద్-1 ఎన్నికలపై జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు



**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** భట్రాజు సంఘంలో పదవీకాలం ముగిసిన తర్వాత కూడా కొందరు నాయకులు తమ హోదాలను కొనసాగిస్తూ కార్యక్రమాలు నిర్వహించడం బైలా ఉల్లంఘన కాదా అని భట్రాజు సంఘం రాష్ట్ర నాయకులు ఓంకారం కీర్తి సంతోష్ రాజ్ తీవ్రంగా ప్రశ్నించారు. సంఘ రాజ్యాంగం స్పష్టంగా ఉన్నప్పటికీ, గడువు ముగిసిన కమిటీలు అధికారంలో ఉన్నట్లు వ్యవహరించడం సభ్యుల్లో అనుమానాలకు తావిస్తోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పదవీకాలం ముగిసిన క్షణం నుంచి ఆ కమిటీలో ఉన్న వారందరూ పూర్వ సభ్యులుగా పరిగణించబడతారని, అలాంటప్పుడు పదవులను కొనసాగిస్తూ నిర్ణయాలు తీసుకోవడం ఎంతవరకు సమంజసమో సంఘ సభ్యులే ఆలోచించాలని కీర్తి సంతోష్ రాజ్ వ్యాఖ్యానించారు. సంఘంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తక్షణమే హడాక్ కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భట్రాజు సంఘ సభ్యుల పూర్తి జాబితాను సిద్ధం చేసి, ఎన్నికల్లో పోటీ చేయదలచిన సభ్యుల వివరాలను హడాక్ కమిటీకి అందజేయాలని సూచించారు. కొత్త రాష్ట్ర కమిటీ ఎన్నికై బాధ్యతలు చేపట్టే వరకు హడాక్ కమిటీ ఆధ్వర్యంలోనే కార్యక్రమాలు నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. అలాగే సంఘ బైలా ప్రకారం జిల్లా కమిటీలను ఎన్నికల ద్వారా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా హైదరాబాద్-1 జిల్లా ఎన్నికలను బైలా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించడం బాధాకరమని, ఆ ఎన్నికల వ్యవహారంపై జిల్లా రిజిస్ట్రార్‌కు అధికారిక ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. సంఘం వ్యక్తుల సొత్తు కాదని, సభ్యుల విశ్వాసంతో నడిచే ప్రజాస్వామ్య వేదిక అని పేర్కొన్న కీర్తి సంతోష్ రాజ్, బైలా అమలు విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదన్నారు. సభ్యుల హక్కులు, సంఘ రాజ్యాంగం పరిరక్షణ కోసం అవసరమైతే మరింత బలమైన పోరాటం చేస్తామని కీర్తి సంతోష్ రాజ్ హెచ్చరించారు.

# రోగుల పట్ల సేవాభావంతో మెలగాలి

- జాయింట్ డైరెక్టర్ టీబి విభాగం డాక్టర్ రాజేశం



**అమీర్ పేట్ (ప్రశ్న న్యూస్)** ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర క్షయ నియంత్రణ విభాగం జాయింట్ డైరెక్టర్, రాష్ట్ర క్షయ శిక్షణా కేంద్రం డైరెక్టర్. డాక్టర్. రాజేశం పిలుపు నిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర క్షయ శిక్షణ కేంద్రంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్రం అభివృద్ధిలో పథం వైపు దూసుకుపోతు దేశానికే దిక్సూచిగా మారిందన్నారు. ప్రతి ఉద్యోగి తన భాధ్యతల నిర్వహణలో రోగుల పట్ల సేవాభావంతో మెలగడం అనేది వైద్య వృత్తికి అత్యంత ముఖ్యమైన పునాదిని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. రాజేశ్వరి, డాక్టర్. నవీన్ కుమార్, డాక్టర్. దీప్తి, ప్రవీణ్ కుమార్, రవికుమార్ సంతోజు, ఫారుక్, లక్ష్మినారాయణ, మహబుబ్ అలీ, నసీర్, ఖాదర్, యాసిన్, శ్రవంతి, ఎస్తేర్ రాణి, జుబేదాబేగం, హరిక, సుధాకర్, స్వప్న, కల్పన, పురుషోత్తం, శ్రీధర్, ప్రేమ్, రాణీబాయి, జ్ఞానేశ్వరి, అక్బరీబేగం, సునీత తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ ఈటల రాజేందర్‌పై కుట్రల వెనుక ఉన్నవారిని నిగ్గు తేల్చాలి

- బడుగు నేతలను అవమానిస్తే భరతం పడతాం
- కేంద్ర మంత్రి, సీఎం అవుతారనే భయంతోనే ఫేక్ వార్తలు
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల ఆగ్రహం






**కీసర (ప్రశ్న న్యూస్)** బడుగు, బలహీన వర్గాల కోసం అహర్నిశలు పాటుపడుతున్న మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై జరుగుతున్న రాజకీయ కుట్రలను బీసీ సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండిస్తోందని ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈటల రాజేందర్ ఎదుగుదలను ఓర్వలేకనే కొందరు దొంగచాటుగా ఫేక్ వార్తలతో కుట్రలకు తెరలేపారని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, దేశంలో బీజేపీ అధికారంలోకి రాకపోవడానికి, ఆ పార్టీ ప్రాధాన్యత తగ్గడానికి ఈటల రాజేందరే శాపమంటూ సాగుతున్న దుష్ప్రచారం వెనుక ఎవరి హస్తం ఉందో, దీనిని ఎవరు నడిపిస్తున్నారో తెలంగాణ సమాజం నిశితంగా గమనిస్తోందన్నారు. భవిష్యత్తులో ఈటల రాజేందర్ కేంద్ర మంత్రి అవుతారనో, రాష్ట్రంలో అధికారం వస్తే ముఖ్యమంత్రి అవుతారనే భయంతోనే ఈ విధమైన కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.

### బీసీ నేతలను లక్ష్యంగా చేసుకుంటున్నారు..

"ఇటీవల కాలంలో రాష్ట్రంలో బీసీ నాయకులను ఎదగకుండా చేసేందుకు ఒక క్రమబద్ధమైన కుట్ర జరుగుతోంది. మొన్నటికి మొన్న తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌పై ఒక ఛానల్‌లో అర్థం లేని అబద్ధపు కథనాలు ప్రసారం చేసి బీసీల మనోభావాలను దెబ్బతీశారు. అలాగే రాష్ట్ర మంత్రివర్గంలోని సహచర మంత్రి వాకిటి శ్రీహరిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రవర్తించిన తీరు కూడా బడుగులను కించపరిచేలా ఉంది" అని జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు.

### ప్రభుత్వం నిగ్గు తేల్చాలి..

అగ్రవర్ణాల నాయకులపై చిన్న మాట అన్నా వెంటనే స్పందించి కేసులు పెట్టే ప్రభుత్వం. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై జరుగుతున్న ఈ కుట్రల వెనుక ఎవరున్నారో ఎందుకు తేల్చడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, సమగ్ర విచారణ జరిపి నిజా నిజాలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆ కుట్రదారులను 'బీసీ ద్రోహులు'గా గుర్తించి, వారికి రాజకీయంగా తగిన బుద్ధి చెబుతామని జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు.

# గజ్వేల్‌లో బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు..

- జాతీయ జెండాను ఆవిష్కరించిన బీజేపీ నాయకులు



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఇందిరాపార్క్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు గాడిపల్లి భాస్కర్, బీజేపీ పట్టణ అధ్యక్షులు మనోహర్ యాదవ్ మాట్లాడుతూ ఎందరో అమరవీరుల త్యాగాలు, బలిదానాల ఫలితంగానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించింది. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా, ప్రజల ఆకాంక్షలు నెరవేరేలా రాష్ట్రంలో పాలన సాగాలని ఆకాంక్షిస్తున్నాం అని వారు పేర్కొన్నారు. తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించే ఏకైక లక్ష్యంతో బీజేపీ నిరంతరం పని చేస్తుందని స్పష్టం చేశారు. స్వరాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన వీరుల బలిదానాలను ఎప్పటికీ మరువలేమని, వారిని స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకులు కుడిక్యాల రాములు, రాంరెడ్డి, రమేష్, నాగు ముదిరాజ్, వెంకట్ రెడ్డి, మర్కంటి ఏగొండ, రొట్టెల రాందాస్, సత్యనారాయణ, బిజెపి మహిళా విభాగం, యువజన విభాగం, బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌ను కలిసిన అక్కెనపల్లి కరుణాకర్



**బోయినిపల్లి / సిరిసిల్ల (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు అక్కెనపెల్లి కరుణాకర్ చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలియజేసిన కరుణాకర్, పలు అంశాలపై స్వల్పంగా సంభాషించినట్లు సమాచారం.

## ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**కాప్రా (ప్రశ్నన్యూస్)** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్నిపురస్కరించుకుని ఏ. ఎస్. రావు నగర్ డివిజన్ లోని రాధిక చౌరస్తాలో జెండా ఆవిష్కరణ చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. దశాబ్దాల పోరాట ఫలితంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవకు కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. జూన్ 2 తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని అసమానతలు, అవమానాలు, అణిచివేతల నుండి విముక్తి పొంది స్వరాష్ట్ర స్వప్నం సాకారమైన చారిత్రక దినమని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరి కృషిని గుర్తు చేసుకుంటూ, రాష్ట్ర అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, రాష్ట్ర నాయకులుసింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి డివిజన్ ప్రధాన కార్యదర్శి పెద్దాపురం కుమార స్వామి, పార్టీ సీనియర్ నాయకులు బేతాళ బాలరాజు, మురళి పంతులు, రమేష్ చారి, కందుల లక్ష్మీనారాయణ, తెలంగాణ పద్మ, కె సత్తమ్మ, గొల్ల పద్మ, సింగారపు మనమ్మ, కే కృష్ణ, ఎస్ కే రహీం, ఎంపీ దాస్, మొగిలయ్య, సింగారపు రాజు, ఈ భాస్కర్, పి.సురేందర్ రావు, గోవర్ధన చారి, మాట్ల గిరి, సకినాల రవి,, సాయి రెడ్డి, నాగపురి రాజు, సహదేవ చారి, హరినాథ్ రెడ్డి, పంతులు నరసింహ, రత్నాల కనకయ్య, ఆనంద్ చారి, ఎం రమేష్ పిట్టల రాజు, పాషా, సత్యనారాయణ గౌడ్ సురేష్, పి కుమార్, సాయి, సత్యనారాయణ, ఉపేందర్ గౌడ్, సురేందర్ చారి
బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 111 జీవోలో అక్రమ నిర్మాణాల జోరు

**- గ్రీన్ బెల్ట్ నిబంధనలు గాలిలో - పరిరక్షించాల్సిన అధికారులు లంచాలకే పరిమితం.?**

**- ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరిధిలో పెరుగుతున్న కాంక్రీట్ అడవులు**

**- శంషాబాద్, మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి ప్రాంతాల్లో విచ్చలవిడిగా నిర్మాణాలు**





**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** పర్యావరణ పరిరక్షణ కోసం తీసుకొచ్చిన 111 జీవో నిబంధనలు కాగితాలకే పరిమితమయ్యాయనే విమర్శలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలను కాలుష్యం నుంచి కాపాడేందుకు ప్రభుత్వం అమలు చేసిన నిబంధనలను కొందరు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూకబ్జాదారులు బేఖాతరు చేస్తూ భారీ స్థాయిలో అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వ నిబంధనల ప్రకారం జలాశయాల పరిసర ప్రాంతాల్లో పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా నిర్మాణాలపై పలు ఆంక్షలు అమలులో ఉండాలి. ముఖ్యంగా 10 శాతం మాత్రమే నిర్మాణం చేసి, మిగిలిన 90 శాతం భూమిని ఖాళీ స్థలంగా లేదా వ్యవసాయ అవసరాలకు వినియోగించాల్సి ఉంటుంది. అలాగే ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ చుట్టూ నిర్దిష్ట పరిధిలో నిర్మాణాల నియంత్రణ ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.శంషాబాద్, మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాల్లో వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి, అనుమతులు లేకుండానే విల్లాలు, ఫార్మ్ హౌస్‌లు, కమర్షియల్ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొన్నిచోట్ల ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూములు, గ్రీన్ బెల్ట్ ప్రాంతాలు కూడా పూర్తిగా ఆక్రమణలకు గురవుతున్నాయని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు.అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు మాత్రం కళ్లుమూసుకుని వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పత్రికలో కథనాలు వచ్చిన స్థానికులు ఎన్ని ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడం, నోటీసులు జారీ చేసినా చర్యలు లేకపోవడం, కూల్చివేతలు చేపట్టకపోవడం వంటి అంశాలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి. కొందరు అధికారులు అక్రమ నిర్మాణదారులతో కుమ్మక్కై భారీ మొత్తాల్లో లంచాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నదేమిటంటే, జలాశయాల పరిసర ప్రాంతాల్లో విచ్చలవిడిగా కాంక్రీట్ నిర్మాణాలు పెరిగితే భూగర్భ జలాల పునరుత్పత్తి దెబ్బతింటుందని, భవిష్యత్తులో తాగునీటి సంక్షోభం మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని. ఒకప్పుడు పచ్చదనంతో కళకళలాడిన ప్రాంతాలు ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారుల చెరలో చిక్కుకుని కాంక్రీట్ అడవులుగా మారుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం వెంటనే ప్రత్యేక సర్వే నిర్వహించి, 111 జీవో నిబంధనలను ఉల్లంఘించి నిర్మించిన అక్రమ కట్టడాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, పర్యావరణ వేత్తలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో హైదరాబాద్‌కు జీవనాధారమైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ఉన్నత అధికారులు ఇప్పటికైన మేల్కొని అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతారా.? లేక మౌనంగానే ఉంటారా.? అన్నది ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

# వాహనాల నెంబర్ ప్లేట్ల మాయ

**- ట్రాఫిక్ పోలీసుల మౌనం ఎందుకు.? - ఆర్టీఏ నిబంధనలకు తూట్లు**

**- ఇష్టారాజ్యంగా తిరుగుతున్న వాహనాలు - నెంబర్ ప్లేట్లు లేకుండా, మార్పులు చేసి రోడ్లపై చక్కర్లు**

**- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులపై ప్రజల ఆగ్రహం**




**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఆర్టీఏ నిబంధనలు అమలవుతున్నాయా.? లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ఏర్పాటు చేయాల్సిన నంబర్ ప్లేట్ల విషయంలో నియమ నిబంధనలు పూర్తిగా గాలికొదిలేసిన పరిస్థితి కనిపిస్తోంది. కొంతమంది వాహనదారులు నంబర్ ప్లేట్లను తమ ఇష్టానుసారంగా డిజైన్ చేసుకోవడం, మరికొందరు చిన్న అక్షరాలతో కనిపించకుండా ఏర్పాటు చేయడం, ఇంకొందరు పూర్తిగా నంబర్ ప్లేట్లే లేకుండా వాహనాలు నడపడం రోజువారీ దృశ్యంగా మారిపోయిందని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఉన్నప్పటికీ, ఓల్డ్ సిటీ ప్రాంతంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. నంబర్ ప్లేట్లు లేకుండా ద్విచక్ర వాహనాలు, ఆటోలు నిర్భయంగా తిరుగుతున్నప్పటికీ ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. రోడ్లపై విధుల్లో ఉన్న సిబ్బంది కళ్లముందే నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలు సంచరిస్తున్నా పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

### అక్రమ కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయా.?

రాత్రి పూట నంబర్ ప్లేట్లు లేకుండా తిరిగే వాహనాలను గుర్తించడం కష్టమవుతుందని, ఇదే కారణంగా కొందరు అక్రమ కార్యకలాపాలకు వాటిని వినియోగిస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. అక్రమ రేషన్ బియ్యం రవాణా, గంజాయి, నిషేధిత వస్తువుల తరలింపు, స్మగ్లింగ్ వంటి కార్యకలాపాల్లో పాల్గొనే వ్యక్తులు తమ గుర్తింపును దాచుకునేందుకు నంబర్ ప్లేట్లు లేకుండా లేదా నకిలీ నంబర్లతో వాహనాలు నడుపుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రి, తెల్లవారుజామున ఇలాంటి వాహనాల సంచారం ఎక్కువగా ఉంటోందని కానీ పోలీసుల నిఘా పూర్తిగా కరువైపోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.నంబర్ ప్లేట్ల స్థానంలో రాజకీయ నాయకుల ప్రచారంమరికొందరు వాహనదారులు నంబర్ ప్లేట్ల స్థానంలో "ముఖ్యమంత్రి తాలూకా", "ఎమ్మెల్యే తాలూకా", రాజకీయ నాయకుల పేర్లు లేదా ఇతర పదజాలంతో బోర్డులు ఏర్పాటు చేసుకుని రోడ్లపై తిరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చట్టం అందరికీ సమానమనే సూత్రం కేవలం పుస్తకాలకే పరిమితమైందా.? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యమే కారణమా.?

నగరంలో ఫుట్‌పాత్ ఆక్రమణలు, ట్రాఫిక్ అస్తవ్యస్తం, నంబర్ ప్లేట్లు లేని వాహనాల సంచారం వంటి అనేక సమస్యలకు ఆర్టీఏ, ట్రాఫిక్ పోలీసులు శాఖల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటే ఇలాంటి పరిస్థితులు తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, అమలు యంత్రాంగం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని విమర్శిస్తున్నారు.గ్రేటర్ హైదరాబాద్ నగరంలో నంబర్ ప్లేట్ల నిబంధనల అమలుపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి, నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేసిన వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీఏ అధికారులు సమన్వయంతో పనిచేసి చట్టాన్ని కఠినంగా అమలు చేస్తేనే ఇటువంటి అవకతవకలకు అడ్డుకట్ట పడుతుందని అభిప్రాయపడుతున్నారు. లేకపోతే నగర రహదారులు నిబంధనల ఉల్లంఘించే వారికే స్వర్గధామంగా మారిపోతాయని ప్రజలు హెచ్చరిస్తున్నారు.




# లాటరైట్‌కు 'సేవింగ్ క్లాజ్' ఇవ్వండి

**- కిషన్ రెడ్డికి చంద్రబాబు లేఖ**



అమరావతి (ప్రశ్న న్యూస్) లాటరైట్ ఖనిజం వర్గీకరణలో కేంద్ర ప్రభుత్వం చేసిన మార్పుల వల్ల రాష్ట్రంలో తలెత్తిన ఇబ్బందులను వివరిస్తూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర గనుల శాఖామంత్రి కిషన్ రెడ్డికి మంగళవారం లేఖ రాశారు. పెండింగ్‌లో ఉన్న గనుల లీజు దరఖాస్తుల విషయంలో వెసులుబాటు కల్పించాలని ఆయన కోరారు. లాటరైట్‌లో అల్యూమినియం శాతం 20 లేదా అంతకంటే ఎక్కువ ఉంటే, దాన్ని ఉప ఖనిజంగా కాకుండా బాక్సైట్‌గా (మేజర్ మినరల్) పరిగణించాలని కేంద్రం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో ఏపీలో గనుల లీజుల ప్రక్రియ పూర్తిగా స్తంభించిపోయిందని చంద్రబాబు తన లేఖలో పేర్కొన్నారు. కేంద్రం తెచ్చిన కొత్త నిబంధనల వల్ల, మైనర్ మినరల్ కింద ప్రాసెస్ చేస్తున్న 402 గనుల లీజు దరఖాస్తులను రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసినట్లు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. నిలిచిపోయిన వాటిలో 19 లెటర్ ఆఫ్ ఇంటెంట్, 113 ప్రభుత్వ భూములు, 255 అటవీ భూములు, 15 పట్టా భూములకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయని వివరించారు.పాత నిబంధనల ప్రకారమే వందలాది మంది దరఖాస్తుదారులు అప్లికేషన్ ఫీజులు, భూముల కొనుగోళ్లు, అటవీ అనుమతుల కోసం ఇప్పటికే కోట్లాది రూపాయలు ఖర్చు చేశారని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. గతంలో మైకా, క్వార్ట్జ్, బారైట్స్ వంటి ఖనిజాలను మైనర్ నుంచి మేజర్ కేటగిరీకి మార్చినప్పుడు కేంద్రం 'సేవింగ్ క్లాజ్' ఇచ్చిందని గుర్తుచేశారు. అదే తరహాలో లాటరైట్ ఖనిజానికి కూడా సేవింగ్ క్లాజ్ వర్తింపజేసి, పెండింగ్‌లో ఉన్న 402 దరఖాస్తులను పాత నిబంధనల ప్రకారమే ప్రాసెస్ చేయడానికి రెండేళ్ల పాటు వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సడలింపు ఇస్తే దరఖాస్తుదారులకు ఆర్థిక నష్టం జరగదని, న్యాయపరమైన వివాదాలు నివారించవచ్చని తెలిపారు. సేవింగ్ క్లాజ్ అమలు చేస్తే సిమెంట్, ఐరన్ ఓర్, రోడ్డు నిర్మాణ పరిశ్రమలకు ముడిసరుకు కొరత లేకుండా ఉపాధి అవకాశాలు నిలబడతాయని చంద్రబాబు తన లేఖలో స్పష్టం చేశారు.

# సీబీఎస్ఈ పోర్టల్‌పై సైబర్ దాడి

**- 2 నిమిషాల్లో 15 లక్షల హిట్స్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సీబీఎస్ఈ వెబ్‌పోర్టల్‌పై హ్యాకర్లు భారీ సైబర్ దాడికి తెగబడ్డారు. విద్యార్థుల రీ-ఎవాల్యుయేషన్, వెరిఫికేషన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైన మొదటి రోజే ఈ ఘటన జరిగింది. అయితే ఈ దాడులను తిప్పికొడుతూ పోర్టల్ ఆగకుండా పనిచేస్తోందని అధికారులు వెల్లడించారు. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి వెబ్‌సైట్ యథావిధిగా సేవలందిస్తోందని సీబీఎస్ఈ స్పష్టం చేసింది.

### రెండు నిమిషాల్లో ముప్పేట దాడి

ఈ సైబర్ దాడికి సంబంధించిన వివరాలను సీబీఎస్ఈ 'ఎక్స్' వేదికగా పంచుకుంది. హ్యాకర్లు ఒకేసారి పెద్ద ఎత్తున 'డినైల్ ఆఫ్ సర్వీస్' దాడికి ఒడిగట్టారు. కేవలం రెండు నిమిషాల వ్యవధిలోనే ఏకంగా 15 లక్షల హిట్స్‌తో పోర్టల్‌ను ముంచెత్తారు. దీనితో పాటు సిస్టమ్‌లో భద్రపరిచిన ఫైళ్లను దొంగిలించడానికి ఒక లక్షకు పైగా అనధికారిక ప్రయత్నాలు జరిగినట్లు బోర్డు గుర్తించింది. సాధారణంగా ఒకేసారి ఇన్ని లక్షల హిట్స్ వస్తే వెబ్‌సైట్ సర్వర్లు తట్టుకోలేక క్రాష్ అవుతాయని నిపుణులు చెబుతున్నారు.

### పక్కాగా పనిచేసిన సాంకేతికత

వేలాది మంది విద్యార్థులు పోర్టల్‌ను వాడుతున్న సమయంలో హ్యాకర్లు అంతరాయం కలిగించడానికి ప్రయత్నించారని బోర్డు పేర్కొంది. అయినప్పటికీ తమ సర్వర్లు ఈ భారీ ట్రాఫిక్‌ను సమర్థంతంగా తట్టుకున్నాయని తెలిపింది. మధ్యాహ్నం 3 గంటల సమయానికి ఒకేసారి 8 వేల మందికి పైగా వినియోగదారులు సైట్‌ను ఉపయోగించారని, అలాగే 18 వేల కంటే ఎక్కువ విజయవంతమైన రీ-ఎవాల్యుయేషన్ దరఖాస్తులు నమోదయ్యాయని బోర్డు వివరించింది.

### విద్యార్థుల కోసం మార్పులు

విద్యార్థుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఈసారి పోర్టల్‌లో కొన్ని కీలక మార్పులు చేసినట్లు సీబీఎస్ఈ వెల్లడించింది. అప్లికేషన్ ప్రక్రియ సులువుగా సాగడానికి సెషన్ సమయ పరిమితిని పెంచినట్లు చెప్పింది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాంకేతిక బృందాలు నిరంతరం వెబ్‌సైట్‌ను పర్యవేక్షిస్తున్నాయని, భద్రతా చర్యలు తీసుకుంటున్నాయని బోర్డు భరోసా ఇచ్చింది.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం..



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)**తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్ర ప్రజలకు తెలుగులో హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ తన 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటున్న తరుణంలో నేతలిద్దరూ ట్విట్టర్ వేదికగా స్పందించారు. తెలంగాణ రాష్ట్రం సాహసం, సంకల్పం, పోరాట పటిమకు ఒక శక్తిమంతమైన ప్రతీక అని ప్రధాని మోదీ కొనియాడారు. ఇక్కడి ప్రజల సృజనాత్మకత, వ్యాపార నైపుణ్యాలు అద్భుతమైనవని, వికసిత భారత్ కలని సాకారం చేయడంలో తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ప్రధాని స్పష్టం చేస్తూ, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. అమిత్ షా సైతం తెలుగులోనే తన సందేశాన్ని పంచుకుంటూ తెలంగాణ విశిష్ట సంస్కృతిని, పారిశ్రామిక నైపుణ్యాన్ని అభినందించారు. దేశ ప్రగతిలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని, రాబోయే రోజుల్లో ఈ రాష్ట్రం మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశ కీర్తిని మరింత పెంచుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొంటూ ఆయన తన సందేశాన్ని 'జై తెలంగాణ'తో ముగించారు. దేశంలోని ఇద్దరు అగ్రనేతలు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాడు ఇక్కడి ప్రజలకు గౌరవపూర్వకంగా మాతృభాషలోనే శుభాకాంక్షలు తెలపడంపై సర్వత్ర హర్షం వ్యక్తమవుతోంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588